Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు The people's Verdict తెలుగు జాతీయ దినపత్రిక

The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను • బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు ఆర్‌సి ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు

8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 283 | హైదరాబాద్ | బుధవారం 26 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# రేవంత్.. కింకర్తవ్యం!

## విపక్షాల గుండెల్లో గుబులు



సొంత పార్టీలో అసమ్మతి సెగలు

కట్టడి చేయకపోవడానికి కారణమేంటో?

ఆ నేతలను దారిలోకి తెచ్చుకుంటారా?

చర్యలు తీసుకుంటారా?.. ఆసక్తిగా మారిన సీఎం నిర్ణయం

ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తూ వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సొంత పార్టీని కట్టడి చేయలేకపోతున్నారా? తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి చర్మిష్మా విపరీతంగా పెరిగింది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ను, అధికారంలోకి రావాలని కంకణం కట్టుకుని పని చేస్తున్న బీజేపీని సమాంతరంగా కట్టడి చేయడంతో పాటు జాతీయ స్థాయి రాజకీయాల్లో కూడా ఆయన తన ముద్రవేసుకున్నారు.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

కానీ, కాంగ్రెస్ పార్టీలోని కొందరు ఆయననే టార్గెట్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యం గా మంత్రి కొండా సురేఖ తనయ ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమా రాన్ని రేపాయి. ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా మంచి నిర్ణయాలతో వ చ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కో సం రేవంత్‌రెడ్డి బాటలు వేస్తుం డగా, సొంత పార్టీ వారే ఆయ నను, ఆయన కుటుంబాన్ని విమర్శిస్తున్నారు. దీంతో ఆయన పరిస్థితి వీధిలో పులి.. ఇంట్లో పిల్లి అన్నచందంగా మారిందన్న చర్చ పొలిటికల్ సర్కిల్‌లో జరుగుతోంది.

### అసమ్మతి మంటలు..

సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఆయనపై కొందరు సొంతపార్టీ నేతలు గుర్రుగా ఉన్నారు. అప్పటి నుంచే పార్టీలో సీనియర్లు, జూనియర్లు.. కొత్త కాంగ్రెస్.. పాత కాంగ్రెస్ అనే సన్నని విభజన రేఖ ఏర్పడింది. వాటన్నింటిని దాటుకుంటూ ఆయన పాలన కొనసా గిస్తున్నారు. కానీ, ఇప్పుడు సొంత పార్టీ నాయకులే బహిరంగంగా తన నాయకత్వాన్ని, నిర్ణయాలను సవాలు చేయడం రేవంత్ రెడ్డిలోని ప్రధాన బలహీనతను బయటపెడు తోంది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ నేరుగా సీఎం, ఆయన కుటుంబ సభ్యులపై ఆరోపణలు గుప్పించడం, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి వంటి సీనియర్లు ప్రభుత్వ వైఖరిని బహిరంగంగా విమర్శించడం కాంగ్రెస్ అంతర్గత ప్రజాస్వామ్యానికి మించిన క్రమశిక్షణా రాహిత్యాన్ని స్పష్టం చేస్తోంది. శత్రు వుల దాడిని తట్టుకోగల నేత, సొంత గుడారంలోని అసమ్మతి మంటలను ఆర్పలేకపోవడం ఆయన

-2వ పేజీలో



# యుద్ధప్రాతిపదికన దేవాదుల పనులు.. ఏడాదిలో పూర్తి

## రెండు దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలి: ఉత్తమ్

- అడ్డంకులన్నీ తొలగించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్.. అటవీ సమస్యల పరిష్కారానికి నిధుల కొరత రానివ్వం
- 6 లక్షల ఎకరాలకు సాగునీరు
- కలెక్టర్లు, ఇంజినీర్లు సమన్వయంతో పనిచేయాలి

హైదరాబాద్, ఆగస్టు 25 (ప్రజాతీర్పు)

దాదాపు రెండు దశాబ్దాలుగా పూర్తిస్థాయిలో ఫలాలు అందించలేకపోతున్న దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలన్న దృఢ సంకల్పంతో తెలంగాణ

-2వ పేజీలో




# స్వైన్ ఫ్లూ కలకలం

## ఢిల్లీలో మూడు వేలకు చేరిన కేసులు

అత్యవసర సమీక్ష నిర్వహించిన సీఎం రేఖా గుప్తా

ఆందోళన అక్కర్లేదన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

దేశ రాజధాని ఢిల్లీలో స్వైన్ ఫ్లూ(హెచ్1ఎన్1) కేసులు కలకలం రేపుతున్నాయి. నగరంలో కేసుల సంఖ్య వేగంగా పెరుగుతుండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటివరకు 3,000 స్వైన్ ఫ్లూ కేసులు నమోదు కావడం అధికార యంత్రాంగాన్ని కలవరపెడుతోంది.

-2లో

# 'మూసీ' భూసేకరణ వేగవంతం చేయాలి

## ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానం రూపొందించాలి: సీఎం రేవంత్

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణపై స్పష్టత ఇవ్వాలి
- మూసీ ప్రాజెక్టు ఫేజ్2కు త్వరగా టెండర్లు పిలవాలి
- సమీక్షలో అధికారులకు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 25 (ప్రజాతీర్పు)

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మూసీ ప్రాజెక్టుపై నిర్వహించిన సమీక్షలో భూసేకరణ సమస్యలు, ల్యాండ్ పూలింగ్ విధానం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణపై సీఎం సమీక్ష నిర్వహించారు. వీటిపై స్పష్టమైన విధానం రూపొందించాలని, భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. ప్రాజెక్టులకు తక్కువ వడ్డీకి లభించే రుణాలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని సూచించారు. భూసేకరణలో భాగమైన టీడీఆర్ అంశంపై ప్రతి వారం సమగ్ర సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు వెంటనే టెండర్లు పిలవాలని సీఎం సూచించారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్కుకు విస్తృత ప్రచారం కల్పించి

-2వ పేజీలో



# కులగణనలో ఓపెన్ ఫార్మాట్ వద్దు

## జనాభా లెక్కల ప్రశ్నావళిని రద్దు చేయాలి

- రాజకీయ పక్షాలు, నిపుణులతో సంప్రదింపులు జరపాలి
- ఆ తర్వాతే కొత్త విధానాన్నఖరారు చేయాలి
- ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ లేఖ

దేశంలో జనాభా లెక్కల సేకరణలో కులాల వివరాల సేకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఓపెన్ ఫార్మాట్ (స్వేచ్ఛగా కులం పేరును నమోదు చేసే) విధానంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

-2లో

# వేటు వేయండి!

## మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారం క్రమశిక్షణారాహిత్యమే

- వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫారసు
- సురేఖకు క్రమశిక్షణారాహిత్యం అలవాటైపోయింది
- సుస్మిత వ్యాఖ్యలు సురేఖకు తెలియకుండా జరిగే అవకాశం లేదు
- పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు నివేదిక ఇచ్చిన కమిటీ

అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ మంత్రి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డిపై చర్యలకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసింది. పార్టీకి ఇబ్బంది కలిగేలా ఉద్దేశ పూర్వకంగా వ్యవహరించారని, ఈ నేపథ్యంలో వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.



హైదరాబాద్, ఆగస్టు 25 (ప్రజాతీర్పు)

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి, చిన్నారెడ్డిని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించాలని పార్టీని కోరింది. ఈ మేరకు కొండా సురేఖ, చిన్నారెడ్డిలకు సంబంధించిన నివేదికలను క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లురవి, సభ్యులు అనంతుల శ్యాంమోహన్, వాజిద్ హుస్సేన్ తదితరులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి నివేదికను అందజేశారు. ఈ నివేదికను ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుందా..? లేక

-2వ పేజీలో



# పట్నాలో రణరంగం

## పరీక్షార్థులపైకి జల ఫిరంగుల్ని ప్రయోగించి చెదరగొడుతున్న దృశ్యం

- ఉపాధ్యాయ అభ్యర్థుల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- రాళ్లు రువ్విన నిరసనకారులు
- లాఠీచార్జి, వాటర్ కెనాన్లతో చెదరగొట్టిన పోలీసులు ?

బిహార్ రాజధాని పట్నా మంగళవారం రణరంగాన్ని తలపించింది. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(బీపీఎస్సీ) వచ్చే నెలలో నిర్వహించనున్న ఉపాధ్యాయ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న వేలాది మంది అభ్యర్థులు ర్యాలీ తలపెట్టగా పోలీసులు అడ్డుకున్నారు.

-2లో

# అవినీతి తప్ప.. అభివృద్ధి ఏదీ?

## రేవంత్ నేల విడిచి సాము చేస్తున్నారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేల విడిచి సాము చేస్తున్నారని, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన వైఫల్యాలు, ఇచ్చిన హామీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రేవంత్ జిమ్మిక్కులు చేస్తున్నారని విమర్శించారు.

న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ప్రజాతీర్పు)

మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సింగరేణి సంస్థను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కేంద్రం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని చెప్పారు. తాడి చర్ల2, పీకేఓసీ2 బ్లాకులతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కోయగూడెం బ్లాక్3 సింగరేణికి దక్కేలా చర్యలు చేపట్టామన్నారు. 120 మిలియన్ టన్నుల నిల్వలున్న ఈ గని ద్వారా సంస్థకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ వైఖరి వల్ల సింగరేణి ఆర్థికంగా దెబ్బతింటోందని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ. 55 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదంటూ రేవంత్ చేస్తున్న ఆరోపణలు.. అసమర్థతను కప్పిపుచ్చు కోవడానికేనని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ముఖ్య మంత్రి, కేంద్రమంత్రి స్థాయి వ్యక్తులు అన్ని అనుమతులు తీసుకున్నాకే విదేశీ పర్యటనలు ఖరారు చేసుకుంటారు. ఆదరాబాదరాగా లండన్ వెళ్లి, అక్కడి నుంచి అమెరికా వెళ్లాలనుకోవడం సరికాదు. విదేశీ పర్యటనల విషయంలో స్వాతంత్ర్యం

-2వ పేజీలో

# యుద్ధప్రాతిపదికన దేవాదుల పనులు.. ఏడాదిలో పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దేవాదుల ప్రాజెక్టును ఫాస్ట్‌ట్రాక్‌పై పెట్టి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దేవాదుల ప్రాజెక్టుపై మంగళవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించగా, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర సాగునీటి చరిత్రలో అత్యంత కీలక మైన ప్రాజెక్టుల్లో దేవాదుల ప్రాజెక్టు ఒకటని పేర్కొన్నారు. గోదావరి జలాలను ఎత్తిపోసి తెలంగాణలోని విశాలమైన ప్రాంతానికి సాగునీటి భరో సా కల్పించాలన్న లక్ష్యంతో దేవాదుల రూపుదిద్దుకున్నదని, దాదాపు రెండు దశాబ్దాల క్రితం చేప ట్టిన ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలిపోవడం దురదృష్టకరమన్నారు. ఇకపై జాప్యానికి తావులేకుండా, ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టంచేశారు. సుమారు 38 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసి, దాదాపు ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో దేవాదుల పథకం రూపుదిద్దుకుందని తెలిపారు. హనుమకొండ, వరంగల్, కరీంనగర్, జనగామ, యాదాద్రి- భువనగిరి, సూర్యాపేట, సిద్దిపేట, మేడ్చల్ -మల్కాజిగిరి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాలకు ఈ ప్రాజెక్టు



ప్రయోజనాలు విస్తరించనున్నాయని వివరించారు.

దేవాదుల ప్రాజెక్టును కేవలం సమీక్షించడానికే పరిమితం కాకుండా, ప్రతి కాంపోనెంట్‌ను విడివిడిగా పరిశీలించి, ఏ పని ఎక్కడ నిలిచిపోయింది..? దానికి కారణమేంటి..? పరిష్కారానికి ఏం చేయాలి..? అనే అంశాలపై లోతుగా చర్చించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రధానంగా భూసేకరణ, -పునరావాస ప్యాకేజీ , అటవీ అనుమతులు, ఇతర పరిపాలనా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల్లో భూసేకరణ తదితర అడ్డంకులను తొలగించేం దుకు సీఎం రేవంత్‌రెడ్డి రూ. 6 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీకి హామీ ఇచ్చారని, అం దులో ఇప్పటికే సుమారు రూ.2,500 కోట్లు విడుదలయ్యాయని వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు కూడా ఇటీవల భూసేకరణ కోసం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అవసరమైన ప్రక్రియలు పూర్తయిన వెంటనే మిగిలిన నిధులను సైతం సమకూరుస్తామని భరోసా ఇచ్చారు. భూసేకరణ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయడమే అంతిమ లక్ష్యం కాదని, భూములు కోల్పోయిన రైతులు, ని ర్వాసితుల చేతికి పరిహారం సకాలంలో చేరినప్పుడే ప్రభుత్వ సంకల్పం సార్థకమవుతుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇదే అంశంపై కలెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలిపారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు, జిల్లా కలెక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

### గరిష్ఠంగా ఎత్తిపోస్తాం..

దేవాదుల సమీక్షలో మరో కీలక నిర్ణయం తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పంపింగ్ వ్యవస్థలన్నింటినీ పూర్తి సామర్థ్యంతో వినియోగించి, గోదావరి నుంచి సాధ్యమైనంత గరిష్ఠ పరిమాణంలో నీటిని ఎత్తిపోసి ఆయకట్టుకు, ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లకు చేరవేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దేవాదుల అమలులో ఎదురైన సమస్యలను సమీక్షలో క్షుణ్ణంగా విశ్లేషించామని, మిగిలిపోయిన ప్రతి అడ్డంకిని అధిగమించేందుకు ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందించినట్లు చెప్పారు.

ఇకపై విధానపరమైన, పరిపాలనా లేదా కాంట్రాక్టు సంబంధిత సమస్యల పేరుతో దేవాదుల పనులు సాగదీయడానికి అవకాశం ఉండదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. గోదావరి జలాలను గరిష్ఠంగా ఎత్తిపోయడం ద్వారా ఈ చారిత్రక ప్రాజెక్టు ఫలాలను సాధ్యమైనంత త్వరగా రైతుల పొలాలకు చేరుస్తామని మంత్రి తెలిపారు.



# రేవంత్.. కింకర్తవ్యం!

(మొదటి పేజీ తరువాయి)

అధికారాన్ని పలచన చేస్తోంది. ప్రత్యర్థుల దాడు లకు ఎంత గట్టిగా కౌంటర్ ఇస్తు న్నారో, సొంత పార్టీ నేతల ఆశలు, ఆకాంక్షలను సంతృప్తి పరచడంలో రేవంత్ అంతగా విఫలమవుతున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి.

### పార్టీలో పట్టులేదా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విపక్షాల విమర్శలను తిప్పికొట్టడంతో పాటు వారికి ధీటైనా సమాధానాలు ఇస్తున్నారు. ఎక్కడా తగ్గేదేలే అన్నట్లు వ్యవహిస్తున్నారు. ఇతర పార్టీల విషయంలో పోటాపోటీగా, పక్కా వ్యూహంతో రాజకీయాలు చేస్తున్నారు. కానీ, సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్ జెండా మోసిన పాత కాంగ్రెస్ నేతలు నిరాశను, వారి పదవుల ఆకాంక్షలను, జిల్లా రాజకీయాల్లో వారి పట్టును బ్యాలెన్స్ చేయలేకపోవడం ఆయనకు పెద్ద సమస్యగా మారింది. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఇస్తున్న ప్రాధాన్యత, సీనియర్లకు దక్కడం లేదనే భావన కాంగ్రెస్ కేడర్‌లో అసంతృప్తికి దారితీస్తోంది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన మూడేళ్ల వ్యవధిలోనే, ఈ అంతర్గత వివాదాలు భగ్గుమంటున్నాయి. విపక్షాలను ఎదుర్కొనే శక్తివంతమైన ప్రతి వ్యూహాన్ని రేవంత్ సిద్ధం చేసుకుంటున్నప్పటికీ, పార్టీని ఒక్కటిగా నడిపించడంలో ఆయన బలహీన ముఖ్యమంత్రిగా ముద్రపడే ప్రమాదముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### బ్యాలెన్స్ చేస్తేనే..

ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచి వెనక్కి వచ్చారు. ఆయన ఇక్కడ పార్టీలో ఏర్పడ్డ ఆగాధాన్ని ఏలా పూడుస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బహిరంగంగా విమర్శలు చేస్తున్న వారిని సొంత పార్టీలోని అసమ్మతి నేతలకు కఠిన సంకేతాలు పంపడం లేదా వారిని నమ్మకంలోకి తీసుకోవడం ద్వారా మాత్రమే రేవంత్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోగలరు. అలా కాకుండా అంతర్గత పోరును నిర్లక్ష్యం చేస్తే, అది విపక్షాలకు అతిపెద్ద ఆయుధంగా మారి సీఎం హోదాను మరింత బలహీనపరిచే ప్రమాదం ఉందనడంలో సందేహం లేదు.

# వేటు వేయండి!

(మొదటి పేజీ తరువాయి)



నేరుగా అధిష్టానం పరిశీలించి నిర్ణయం వెంటనే తీసుకుంటుందా? లేక ఏఐసీసీ స్థాయిలో వారిద్దరిని పిలిపించి వారి వివరణలు తీసుకున్నాక తుది నిర్ణయం తీసుకుంటుందా అన్న ఆసక్తికర చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. మంత్రి కొండా సురేఖ విషయంలో ఇచ్చిన నివేదికలో 'క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడటం సురేఖకు అలవాటుగా మారింది. ఆమె రాజకీయ నేపథ్యమంతా వివాదాలతో కూడుకున్నదే. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఆమె వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. రెండుసార్లు పార్టీకి క్షమాపణలు చెప్పి మళ్లీ పార్టీ నియమావళిని ఉల్లంఘించారు. అమెను మంత్రి పదవి నుంచి తప్పించడమే సరైన చర్య అని భావిస్తున్నాం' అని నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. సురేఖకు సంబంధించి మూడు, చిన్నారెడ్డిపై రెండు పేజీల నివేదికతోపాటు ఇందుకు తగిన ఆధారాలను కూడా పొందుపరిచిన క్రమశిక్షణ కమిటీ ఇదే నివేదికను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌కు కూడా పంపినట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం ' చిన్నారెడ్డికి గత ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోయినా, గెలిచి ప్రభుత్వం వచ్చిన తర్వాత మంచి అవకాశం ఇచ్చాం. కేబినెట్ హోదా ఇచ్చాం. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి హోదాలో ఆయన కేబినెట్ సమావేశాలకు కూడా వస్తున్నారు. తొమ్మిదిసార్లు ఆయనకు పార్టీ టికెట్ ఇచ్చింది. పోటీ చేసేందుకు అవకాశామిచ్చింది. కానీ ఉద్దేశపూర్వకంగానే పార్టీకి ఇబ్బంది కలిగేలా వ్యవహరించారని, పార్టీకి నష్టం కలిగేలా మాట్లాడారని క్రమశిక్షణ కమిటీ భావిస్తోంది. దీన్ని తీవ్రంగా పరిగణించి ఆయన్ను పదవి నుంచి తప్పించాలి' అని చిన్నారెడ్డి గురించి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు నివేదిక ఇచ్చిన అనంతరం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లురవి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ ప్రధానమైందని చెప్పారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి గురించిన అన్ని విషయాలు, సిఫారసులను తమ నివేదికలో పొందుపర్చామని చెప్పారు. ఈ నివేదికను ఏఐసీసీ చీఫ్, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శికి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పంపుతారని చెప్పారు. ఏదైనా హైకమాండ్‌దే తుది నిర్ణయమని, తమ సిఫారసుల ద్వారా పార్టీ కేడర్‌కు ఓ సందేశం వచ్చేలా నివేదిక ఇచ్చామని మల్లురవి స్పష్టం చేశారు. పార్టీ పెద్దగా తనకు ఇవ్వాల్సిన గౌరవాన్ని కూడా సురేఖ, చిన్నారెడ్డి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ క్రమశిక్షణ కోణంలో ఆ ఇద్దరికి నోటీసులు ఇస్తే.. ఆ నోటీసులనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ సమాధానం ఇవ్వడం సబబు కాదని వ్యాఖ్యానించారు. కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన అంశం కొండా సురేఖకు తెలియకుండానే జరుగుతుందా అని ప్రశ్నించారు. సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కలిసి నివేదికలోని అంశాలను వివరించడానికి ప్రయత్నించారు. కానీ రేవంత్ బిజీ షెడ్యూల్ కారణంగా కలవలేకపోయారని, వీలును బట్టి బుధవారం సీఎంను కలిసే అవకాశం ఉన్నట్లు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. కఠిన చర్యలు తీసుకోవాలన్న క్రమశిక్షణ కమిటీ నివేదిక నేపథ్యంలో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తి కలిగిస్తోంది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించేందుకు హైకమాండ్ అంగీకరిస్తుందా? లేక గౌరవప్రదంగా ఆమెతో రాజీనామా చేయిస్తుందా..? లేక మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆమె శాఖను మారుస్తారా.. ఇంతకు ఏ నిర్ణయం తీసుకుంటారో అనే అంశం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశం అవుతోంది. మరోవైపు చిన్నారెడ్డి విషయంలో ఢిల్లీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు... అధికారిక పదవి నుంచి మాత్రమే తప్పిస్తారా లేదంటే మందలింపుతో సరిపెడతారా అన్నది ఆసక్తికరంగా మారింది.

# స్వైన్ ఫ్లూ కలకలం

న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ప్రజాతీర్పు)

ఈ నేపథ్యంలో తక్షణ నివారణ చర్యలు, వైద్య సదుపాయాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేఖా గుప్తా మంగళవారం ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పలువురు మంత్రులతో సీఎం రేఖా గుప్తా ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. నగరవ్యాప్తంగా స్వైన్ ఫ్లూ వ్యాప్తి తీరు, ఆస్పత్రుల్లో బాధితులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య మరింత పెరిగితే, దానికి అనుగుణంగా అదనపు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన చోట పడకల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశం అనంతరం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పంకజ్ సింగ్ మీడియాతో మాట్లాడారు. నగరంలో స్వైన్ ఫ్లూ పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని స్పష్టంచేశారు. కేసుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు చికిత్స అందించేందుకు సరిపడా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని స్పష్టం చేశారు. స్వైన్ ఫ్లూ చికిత్సకు అవసరమైన ఔషధాలు, ఇతర అత్యవసర వైద్య పరికరాల నిల్వలు పూర్తిస్థాయిలో ఉన్నాయని మంత్రి వివరించారు. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి వంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించాలని ప్రజలకు సూచించారు. సొంత వైద్యం చేసుకోకుండా, వైద్యుల సలహా మేరకే ఔషధాలు ఉపయోగించాలని కోరారు.




# పట్నాలో రణరంగం

పట్నా, ఆగస్టు 25

తమ సమస్యలను విన్నవించుకునేందుకు ముఖ్యమంత్రి నివాసం వైపునకు ర్యాలీగా వెళ్తుండగా అనుమతి లేదని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులపై నిరసనకారులు రాళ్లు రువ్వుతారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జి చేశారు. వాటర్ కెనాన్లు ప్రయోగించారు. ఉపాధ్యాయ నియామక రాత పరీక్షలను ప్రిలిమ్స్, మెయిన్స్ అనే రెండు దశల్లో కాకుండా ఒకే దశలో నిర్వహించాలని అభ్యర్థులు డి మాండ్ చేస్తున్నారు. ప్రభు త్వంపై ఒత్తిడి పెంచడానికి 'ముఖ్యమంత్రి నివాస ముట్టడి'కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఏడాది ప్రారంభంలో బీపీఎస్సీ నిర్వహించిన 'కంబైన్డ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్'లో అక్రమాలు జరిగాయని నిరసనకారుల్లో మరో వర్గం ఆరోపించింది. ఆ పరీక్షలను తక్షణమే రద్దు చేయాలని పట్టుబట్టింది. పోరాటంలో భాగంగా పట్నాలోని చారిత్రక గాంధీ మైదాన్ వద్ద ప్రారంభమైన ర్యాలీలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ వంటి సంఘాలకు చెందిన వామపక్ష కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. గాంధీ మైదాన్ నుంచి ముఖ్యమంత్రి నివాసం వరకు దాదాపు 5 కిలోమీటర్ల మార్గంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. జేపీ గోలాంబర్ వద్ద పోలీసులు వాటర్ కెనాన్లను ప్రయోగించగా, నిరసనకారులు నీటిలో తడుస్తూనే రెయిన్ డ్యాన్స్ చేయడం కనిపించింది. నిరసనకారులు బారికేడ్లను ఛేదించుకుని ముందుకు పరుగులు తీశారు. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. నిరసనకారులను అదుపులోకి తీసుకొని నగరంలో వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. పరిస్థితి ఇప్పుడు అదుపులోనే ఉందని అధికారులు వెల్లడించారు. సమస్యల పరిష్కారం కోసం కొన్ని వారాలుగా ధర్నా చేస్తున్న అభ్యర్థులను కించపరిచేలా, బీపీఎస్సీ పరీక్షల నియంత్రణాధికారి రాకేష్‌కుమార్ సింగ్ సోమవారం 'ఏనుగు బజారులో నడుస్తుంటే వేలకొద్దీ కుక్కలు మొరుగుతాయి'అనే హిందీ సామెతను ప్రయోగించడంపై నిరసనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అవినీతి తప్ప.. అభివృద్ధి ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినప్పటి నుంచీ విదేశాంగ శాఖ నిబంధనలు అమలులో ఉన్నాయి. దేశ ప్రయోజనాలు, పర్యటించే వ్యక్తుల నేపథ్యం ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయి. ఇది కేవలం పాలనాపరమైన అంశం తప్ప ఇందులో ఎలాంటి రాజకీయం లేదు'అని స్పష్టం చేశారు. 2005లో నరేంద్రమోదీ అమెరికా పర్యటనకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిరాకరించిందని గుర్తుచేశారు. గతంలో తనతో సహా పలువురు కేంద్రమంత్రుల పర్యటనలను కూడా విదేశాంగ శాఖ నిరాకరించిందని చెప్పారు. ప్రధాని మోదీని టెర్రరిస్టుతో పోల్చిన, పాకిస్తాన్ అనుకూల వ్యక్తి, న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీని కలవడానికి రేవంత్ ఎందుకు ప్రయత్నించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### విద్యారంగాన్ని విస్మరించి..

విదేశీ యూనివర్సిటీలను తీసుకొస్తామని గొప్పలు చెప్పుకునే రేవంత్‌రెడ్డి, ముందు రాష్ట్రంలోని విద్యావ్యవస్థ పరిస్థితి ఏంటో సమాధానం చెప్పాలని కిషన్‌రెడ్డి నిలదీశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు, విద్యార్థులకు ఉచిత స్కూటీలు, విద్యా భరోసా కార్డులు, మండలానికి అంతర్జాతీయ పాఠశాల ఇస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కొత్త యూనివర్సిటీల మాట పక్కనబెట్టి, ముందు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన అట్టర్ ఫ్లాప్ అయిందని, హైదరాబాద్‌లోనే 20 శాతం ఇళ్లకు కూడా ఎన్యూమరేటర్లు వెళ్లలేదని ఎద్దేవా చేశారు.

# 'మూసీ' భూసేకరణ వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సందర్శకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, జేఎండీ గౌతమి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు 55 కిలోమీటర్ల కారిడార్‌ను పునరుద్ధరించే లక్ష్యంతో పనులు చేపడుతున్నట్టు ఎంఆర్‌డీసీఎల్ అధికారులు తెలిపారు. మూసీ పరిధిలోని ఎంఎఫ్ఎల్/బఫర్ జోన్లలో భూములను స్వచ్ఛందంగా అప్పగించే వారికి టీడీఆర్ అందించే విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మూసీ ప్రాజెక్టులో భూసేకరణకు సంబంధించి కొందరు యజమానులు టీడీఆర్‌కు బదులుగా నగదు, ఇళ్లు లేదా ఓపెన్ ప్లాట్లు కోరుతున్నట్టు సమాచారం. భూముల స్వభావం, హక్కులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను స్పష్టంగా నిర్ధారించడం ద్వారా భవిష్యత్ న్యాయ వివాదాలను నివారించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# కులగణనలో ఓపెన్ ఫార్మాట్ వద్దు

- కచ్చితమైన వివరాల కోసం 'డ్రాప్‌డౌన్' పద్ధతి అమలు చేయాలని సూచన
- తెలంగాణ, బిహార్ విధానాలను అనుసరించాలని వెల్లడి
- తప్పుడు డేటాతో ఓబీసీలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన

న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ప్రజాతీర్పు)

ఈ పద్ధతి వల్ల కచ్చితమైన వివరాలు నమోదు కాకపోగా, కులగణన అసలు లక్ష్యమే నీరుగారిపోతుందని రాజ్యసభ, లోక్‌సభ ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రశ్నావళిని తక్షణమే రద్దు చేయాలని, రాజకీయ పక్షాలు, నిపుణులతో విస్తృతంగా సంప్రదింపులు జరిపిన తర్వాతే కొత్త విధానాన్ని ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఖర్గే, రాహుల్ సంయుక్తంగా లేఖ రాశారు.

జనాభా లెక్కల్లో కులాల నమోదు కోసం ఎలాంటి కచ్చితమైన ముందస్తు జాబితా లేకుండా 'ఓపెన్‌ఎండెడ్'ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. దీనిద్వారా పౌరులు తమ కులం పేరును ఇష్టం వచ్చిన రీతిలో చెప్పుకునే అవకాశం ఉంటుంది. దేశవ్యాప్తంగా ఒకే కులానికి వేర్వేరు పేర్లు, ఉప కులాలు, భిన్నమైన స్పెల్లింగ్‌లు వాడుకలో ఉన్నాయని ఖర్గే, రాహుల్ తమ లేఖలో ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విధానం వల్ల ఒకే కులం వేలాది వేర్వేరు పేర్లతో నమోదయ్యే ప్రమాదం ఉందని వివరించారు. దానివల్ల దేశంలో కులాల సంఖ్య లక్షల్లో ఉన్నట్లుగా తప్పుడు డేటా వస్తుందని, ఫలితంగా మొత్తం కులగణన ప్రక్రియే



నిరుపయోగంగా మారుతుందని తేల్చిచెప్పారు.

ఈ గందరగోళాన్ని నివారించడానికి ఓపెన్ ఫార్మాట్ బదులుగా 'డ్రాప్‌డౌన్'జాబితా పద్ధతిని అమలు చేయాలని ఖర్గే, రాహుల్ సూచించారు. జనాభా లెక్కల సేకరణ సిబ్బంది వద్ద ముందుగానే పొందుపరిచిన కులాల జాబితా ఉంటే కచ్చితమైన సమాచారం నమోదు చేయడానికి వీలుంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల జన గణనకు ఇప్పటికే ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల(ఎస్ఈబీసీ) జాబితా, ఆంత్రోపోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డేటా ఆధారంగా ఈ డ్రాప్‌డౌన్ జాబితాను సులభంగా తయారు చేయవచ్చని సూచించారు. తెలంగాణ (2024), బిహార్ (2022) రాష్ట్రాల్లో చేపట్టిన కులగణనల్లో ఈ డ్రాప్‌డౌన్ విధానాన్నే అనుసరించారని వెల్లడించారు. ఆయా రాష్ట్రాల కులాల జాబితా కాపీలను ప్రధానికి రాసిన లేఖకు జతచేశారు.

### ప్రశ్నావళిలో 'వెనుకబడిన తరగతి' పదం ఏదీ?

కేంద్రం తీసుకొచ్చిన తాజా ప్రశ్నావళిలో కనీసం 'వెనుకబడిన తరగతి'అనే పదం కూడా లేకపోవడంపై కాంగ్రెస్ అగ్రనేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కులగణనలో సరైన గణాంకాలు రాకపోతే అత్యంత నష్టపోయేది ఓబీసీలు, ఇతర అట్టడుగు వర్గాలేనని స్పష్టం చేశారు. దీనివల్ల విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, ప్రభుత్వ పథకాల రూపకల్పన వంటి కీలక అంశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.

### గణాంకాలు చెబుతున్న వాస్తవాలివే..

కులగణన కచ్చితంగా జరగాల్సిన అవసరాన్ని పలు గణాంకాలతో సహా ఖర్గే, రాహుల్ వివరించారు. అధికారిక లెక్కల ప్రకారం కేంద్ర ఓబీసీ జాబితాలో 2,479 కులాలు ఉన్నాయి. రాష్ట్రాల జాబితాలను కలుపుకుంటే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. గతంలో మండల్ కమిషన్ దేశంలో 3,743 వర్గాలను ఓబీసీలుగా గుర్తించింది. 201921 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) అంచనాల ప్రకారం దేశ జనాభాలో ఎస్సీలు 22 శాతం, ఎస్టీలు 9 శాతం, ఓబీసీలు 42 శాతం, ఇతరులు 27 శాతం ఉన్నారు.

పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే(పీఎల్ఎఫ్ఎస్)2025 అంచనాల ప్రకారం ఎస్సీలు 20 శాతం, ఎస్టీలు 9 శాతం, ఓబీసీలు 46 శాతం, ఇతరులు 24 శాతం వరకు ఉన్నారు. ఈ నేపథ్యంలో 'ఓపెన్ ఫార్మాట్'విధానాన్ని అమలు చేస్తే ఈ వాస్తవ గణాంకాలన్నీ తప్పులతడకగా మారిపోయే ముప్పు ఉందని ఖర్గే, రాహుల్ తమ లేఖలో ఉద్ఘాటించారు. ఈ పరిస్థితిని నివారించి, కుల గణన ద్వారా కచ్చితమైన సమాచారం రాబట్టేలా పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు.



కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా మార్చి అభివృద్ధికి కేంద్రం నుండి మరిన్ని నిధులు తేవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కోరిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుంకరి గణపతి

-ప్రజాతీర్పు, కరీంనగర్

# మాదిగ జాగృతి నూతన కమిటీ ఏర్పాటు



**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 24**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో జరిగిన మాదిగ జాగృతి సంఘం మంచిర్యాల జిల్లా కమిటీని జాతీయ అధ్యక్షుడు భీంరావు మహారాజ్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షునిగా జంగపల్లి రామస్వామి,మహారాజ్, ఉపాధ్యక్షులుగా గోగర్ల కొమురేష్,కల్లెపల్లి రమేష్,ప్రధాన కార్యదర్శి లుగా దూడ రవి,ఇప్ప విష్ణు,కార్యదర్శులుగా కలువల విజయ్ కుమార్,జిల్లా కమిటీ సభ్యులుగా ఎల్తూరి శంకర్,రేగుంట రాకేష్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా భీమ్ రావు మహారాజ్ మాట్లాడుతూ జిల్లాలో సంఘం ను బలోపేతం చేయడానికి జిల్లా కమిటీ కృషి చేయాలని కోరారు.

# దేశంలోని కోటి కుటుంబాలకు సౌర విద్యుత్తు

- ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్ టాప్ సోలార్ సిస్టం
- సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి
- పోస్టర్ ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఆగస్టు25**

పేదలపై విద్యుత్ భారాన్ని తగ్గించడం, తద్వారా కర్బన ఉద్ఘరాలు,వాతావరణ కాలుష్యాన్ని నివారించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని తీసుకువచ్చిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. జైవిక్ కంపెనీ భాగస్వామ్యంలో తెలంగాణలో ఈ పథకాన్ని అమలు చేయడానికి మారుతి ఏజెన్సీస్ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్,మారుతి ఏజెన్సీస్ నిర్వాహకుడు తిప్పారపు ఆంజనేయులు, ఆ సంస్థ ప్రతినిధులు దేవోజు వెంకటరమణాచారి,తిప్పారపు రవివర్మ లతో కలసి ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం పోస్టర్లను మంగళవారం ఇక్కడ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2027 మార్చి నాటికి దేశంలోని కోటి కుటుంబాలకు సౌర విద్యుత్ అందించే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తున్నదని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్ టాప్ సోలార్ స్కీమ్ గా ఆయన అభివర్ణించారు. ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి సగటున రూ.77,800 సహాయం అందుతుందన్నారు. ఒక కిలో వాట్ వరకు రూ.30,000, రెండు కిలోవాట్లకు రూ. 60000, మూడు కిలోవాట్లకు 78 వేల సబ్సిడీ లబ్ధిదారులకు లభిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా తమ గృహాలకు అవసరమైన విద్యుత్తును వాడుకొని మిగిలిన విద్యుత్తును లబ్ధిదారులు డిస్కంలకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ పథకానికి సంబంధించిన వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన మారుతి ఏజెన్సీస్ నిర్వాహకులను కోరారు.

# పెట్టేం నవీన్‌కు అభినందనలు తెలిపిన సత్తు మల్లేష్

**శరత్ రావు కరీంనగర్ ఆగస్ట్ 25 (ప్రజాతీర్పు)**



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా చైర్మన్‌గా నియమితులైన పెట్టేం నవీన్‌ను కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ గాంధీభవన్లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభి నందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్తు మల్లేష్ మాట్లాడుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో సోషల్ మీడియా పాత్ర అత్యంత కీలకంగా మారిందని, పార్టీ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి వేగంగా, సమర్థవంతంగా చేరవేయడంలో ఈ విభాగానిదే ప్రధాన బాధ్యత అని అన్నారు. ఈ విషయంలో నవీన్‌కు ఉన్న అనుభవం, అంకితభావం పార్టీకి ఎంతో ఉపయోగపడతాయని, ఆయన నాయకత్వంలో సోషల్ మీడియా విభాగం మరింత చురుగ్గా పనిచేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వం, పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజనుల హక్కులు-అభివృద్ధి కోసం జాతీయ ఎస్సీ/ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన సర్పంచ్ లావుడ్యా పూర్ణ

**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 25 (ప్రజా తీర్పు)**

రేగళ్ల: రేగళ్ల రెవెన్యూ పరిధిలోని గిరిజనుల సమస్యలను జాతీయ స్థాయిలో పరిష్కరించేందుకు పెద్దతండా గ్రామ సర్పంచ్ లావుడ్యా పూర్ణచందర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జాతీయ ఎస్సీ/ఎస్టీ కమిషనర్ జాటోత్ హుస్సేన్ నాయక్‌ను కలిసి రేగళ్ల ప్రాంత గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరిస్తూ సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. రూ.10 కోట్ల రహదారి పనులపై విచారణకు విజ్ఞప్తి రేగళ్ల--కరకవాగు రహదారి నిర్మాణ పనులు సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని, ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని సర్పంచ్ కోరారు. రోడ్డు నిర్మాణంలో నిబంధనలకు విరుద్ధంగా చెరువు మట్టిని ఉపయోగిస్తున్నట్లు, మట్టికి అవసరమైన ప్లాస్టిక్ ఇండెక్స్ ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ డ్రైనేజీలు, వాగులు--వంకల వద్ద కల్వర్టులు, ఇతర కాంక్రీట్ పనుల్లోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్టిమేట్, బీఓక్యూ ప్రకారం ఇసుక, ఎం-శాండ్ వినియోగించాల్సి ఉండగా కేవలం క్రషర్ డస్ట్‌తో పనులు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు పనులకు సంబంధించిన ఎస్టిమేట్, బీఓక్యూ, మెటీరియల్ టెస్ట్ రిపోర్టులు, మిక్స్ డిజైన్, క్వాలిటీ కంట్రోల్ రికార్డులను పరిశీలించి అవసరమైన చోట నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని కోరారు. లోపాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.



### అర్హులైన గిరిజన రైతులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలి

రేగళ్ల రెవెన్యూ పరిధిలో ఎన్నో సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న అర్హులైన గిరిజన రైతులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు. హక్కు పత్రాలు లేకపోవడం వల్ల గిరిజన రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్హత కలిగిన ప్రతి రైతు దరఖాస్తును చట్ట ప్రకారం పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఎస్సీ కాలనీ, ఎస్టీ తండాల్లో సమాన అభివృద్ధి

రేగళ్ల ప్రాంతంలోని ఎస్సీ కాలనీ, ఎస్టీ తండాలు, ఇతర గిరిజన ఆవాస ప్రాంతాల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను అన్ని ప్రాంతాలకు సమానంగా అందించాలని కోరారు.

### కేటీపీఎస్, నవభారత్ సీఎస్‌ఆర్ నిధులతో గిరిజన ప్రాంతాల అభివృద్ధి

రేగళ్ల ప్రాంతానికి సమీపంలోని కేటీపీఎస్, నవభారత్ సంస్థలు తమ సీఎస్‌ఆర్ కార్యక్రమాల్లో ఈ ప్రాంతాన్ని ప్రాధాన్యతగా గుర్తించాలని సర్పంచ్ కోరారు. స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎస్‌ఆర్ నిధులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

### గిరిజనుల హక్కుల కోసం నిరంతరం కృషి

గిరిజనుల సమస్యలు కేవలం ఒక గ్రామానికి సంబంధించినవి కావని, వారి హక్కులు, భవిష్యత్తుకు సంబంధించిన అంశాలని సర్పంచ్ లావుడ్యా పూర్ణచందర్ తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతతో పాటు అర్హులైన గిరిజనులకు చట్టబద్ధమైన హక్కులు అందేలా నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. రేగళ్ల ప్రాంత గిరిజనుల సమస్యలను జాతీయ స్థాయిలో పరిష్కరించాలనే ఉద్దేశంతో జాతీయ ఎస్సీ/ఎస్టీ కమిషనర్ జాటోత్ హుస్సేన్ నాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. గిరిజనుల హక్కులు, అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.



# ప్రజల సహకారంతో రోడ్డు గుంతలకు చెక్..

21వ వార్డు కౌన్సిలర్ పద్మ సింగరావుకు ప్రశంసలు...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగష్టు 25.**

జగిత్యాల పట్టణంలోని 21వ వార్డులో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్డు గుంతలను ప్రజల సహకారంతో పూడ్చించి వార్డు కౌన్సిలర్ సిరికొండ పద్మ సింగరావు ప్రశంసలు అందుకున్నారు. వార్డులోని లింక్ రోడ్డు, ప్రధాన రోడ్డుకు అనుసంధానమయ్యే గల్లి రోడ్డుకు మధ్య భాగంలో గత కొంతకాలంగా గుంత ఏర్పడి, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండేది. దీంతో రోడ్డు పరిస్థితి కనిపించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గుంత ఎంత లోతుగా ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారు. నాలుగు చక్రాల వాహనాలు కూడా ఆ మార్గంలో వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొనేవి. ఈ సమస్యను స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, నిధుల కొరత కారణంగా పనులు చేపట్టలేకపోయారు. దీంతో ప్రజల ఇబ్బందులను గుర్తించిన 21వ వార్డు కౌన్సిలర్ సిరికొండ పద్మ సింగరావు స్వచ్ఛందంగా ముందుకొచ్చి, స్థానిక ప్రజల సహకారంతో సిమెంట్, కంకర, ఇసుక ఏర్పాటు చేసి రోడ్డు గుంతలను పూడ్చించారు. దీంతో రహదారి మళ్లీ ప్రయాణానికి అనువుగా మారింది. ప్రజల సమస్యను వెంటనే గుర్తించి, ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా ప్రజల భాగస్వామ్యంతో పనులు పూర్తి చేయించడం పట్ల స్థానికులు కౌన్సిలర్ పద్మ సింగరావును అభినందిస్తూ "ప్రజల కౌన్సిలర్" అని కొనియాడుతున్నారు. ఈ చర్య ఇతర ప్రజాప్రతినిధులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



# తండ్రి ప్రేమ కోసం కూతురు ఆమరణ నిరాహార దీక్ష

భద్రాచలంలో చర్చనీయాంశంగా మారిన కుటుంబ వివాదం

**భద్రాచలం, ఆగస్టు 25 (ప్రజా తీర్పు):**

కన్నతండ్రి ప్రేమ, ఆదరణ కోసం ఓ కూతురు ఆమరణ నిరాహార దీక్షకు దిగిన ఘటన భద్రాచలంలో చర్చనీయాంశంగా మారింది. తన సోదరుడికి ఇస్తున్న ప్రేమ, ఆదరణ తనకు ఇవ్వడం లేదని, తనను కుటుంబానికి దూరం చేస్తున్నారని కూతురు ఆరోపించింది. ఆస్తి తనకు అవసరం లేదని, తండ్రి తనను కూతురిగా గుర్తించి సమానంగా ప్రేమించాలని కోరుతున్నట్లు తెలిపింది. ఈ కుటుంబంలో గత పదేళ్లుగా వివాదాలు క నసాగుతున్నాయని కూతురు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. భార్య విజయలక్ష్మిని భర్త దూరంగా ఉంచుతున్నారని, ఆస్తిలో న్యాయమైన వాటా ఇవ్వడం లేదని వారు పేర్కొంటున్నారు. కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన కూతురు తండ్రి ప్రేమ, ఆదరణ కోసం ఆమరణ నిరాహార దీక్షకు దిగినట్లు తెలిపారు. కొడుకు, కూతురు మధ్య తండ్రి వివక్ష చూపుతున్నారని కూతురు ఆరోపించింది. కుటుంబ సమస్యల పరిష్కారంలో రాజకీయ పలుకుబడి ప్రభావం చూపుతోందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తనతో దుర్భాషలాడుతున్నారని కూడా ఆమె పేర్కొన్నట్లు సమాచారం. కూతురు ఆమరణ నిరాహార దీక్షకు దిగడంతో స్థానికంగా ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. అధికారులు, మహిళా సంక్షేమ శాఖ, పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని కుటుంబ వివాదంపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే కూతురు, ఆమె కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై తండ్రి వైపు వివరణ రావాల్సి ఉంది. ఇరువైపుల వాదనలు, అధికారుల విచారణ అనంతరం పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎంహెచ్వో డాక్టర్ నరేందర్ రాథోడ్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 25**

మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ మరియు లైన్స్ క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన అవశ్యకత కార్యక్రమమును ప్రారంభించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 25వ ఆగస్టు నుండి 8 సెప్టెంబర్ వరకు నేత్రదానము దాని ప్రాముఖ్యత పైన అవగాహన కలిగిస్తున్నట్లు తెలియజేసినారు ముఖ్యంగా ఈ అవగాహన కార్యక్రమాలను సామాజిక ఆరోగ్య కార్యక్రమాలను లైన్స్ క్లబ్ ఎన్జీవోలు సహకారంతో జిల్లా అందత్వ నివారణ అధికారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టుతున్నట్లు పాఠశాలలు కళాశాలలో మరియు మున్సిపల్ పరిధిలోని ఉద్యోగస్తులకు సిబ్బందికి మరియు గ్రామాలలో ఆశ ఆరోగ్య వైద్యాధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలను మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. ముఖ్యంగా మన దేశంలో కొన్ని లక్షల మంది కంటిలోని నల్లపాప తెల్లగా మారి చూపు కోల్పోతున్నారు వారందరూ అందమైన ప్రకృతిని చూసే అవకాశాన్ని,కోల్పోతున్నారు అట్టివారికి నేత్రదానం వలన చక్కని చూపులు ప్రసాదించవచ్చును ఈ పవిత్ర కార్యక్రమం కొరకు నేను నా మరణాంతరము నేత్రదానం చేసి వారికి చూపు ప్రసాదిస్తాను మరియు నా ఇరుగు పొరుగు తోటి భారత పౌరులకు నేత్రదానం పట్ల అవగాహన కల్పిస్తాను వారి బ్రతుకుల్లో వెలుగులు నింపి వారికి కంటి చూపును ప్రసాదిస్తానని ప్రతిజ్ఞ చేయించడం జరిగినది ఈ విషయాలన్నీయు ప్రజలకు అవగాహన




కలిగించాలని దృష్టిలోపం వలన ఎన్నో కారణాల ద్వారా ఇవి జరుగుతది ముఖ్యంగా దెబ్బ లేదా గాయం కావడం పోషకార లోపం వంశపార్యపరేత రసాయనిక చర్యలు వలన జరుగు ప్రమాదాలు వీటి ద్వారా కార్నియాకు సమస్యలు వచ్చినప్పుడు చూపు కోల్పోవడం జరుగుతుంది కావున నేత్రదానం వల్ల మనము కంటి చూపును తిరిగి పొందవచ్చును నేత్రదానం అన్ని మతాలవారు చేయవచ్చు ఏ వ్యక్తి అయినా స్త్రీ మరియు పురుషుడు నేత్రదానం చేసినట్లు ప్రకటించిన ప్రకటించకున్న దానం చేయవచ్చును కావున ప్రజలందరూ ఈ నేత్రదానం యొక్క ఆవశ్యకతను ప్రజలలో అవగాహన కలిగించాలని కోరినారు ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ సుధాకర్ నాయక్,జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సంచాలకులు డాక్టర్ అశోక్ కుమార్,డాక్టర్ శ్రీధర్,నేత్ర వైద్య నిపుణులు జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, జిల్లా కంటి అధికారి శ్రీ శంకర్,జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్ అల్లాడి శ్రీనివాస్,నామ్ దేవ్ నర్సింగ్,అధికారులు సిహెచ్ఓలు పుట్టా సత్తయ్య నాందేవ్,మరియు జిల్లాలోని లైన్స్ క్లబ్ మంచిర్యాల గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో చేపట్టడం జరిగినది ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు కార్యదర్శి మరియు శ్రీ మధుసూదన్ రెడ్డి, పాల్గొన్నారు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టుతున్న ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నేత్రదానంలో అవగాహన కార్యక్రమంలో పాల్గొనడం ప్రజలకు అవగాహన కలిగించడంలో శస్త్ర చికిత్సలు చేయించడంలో ముందుంటున్న లైన్స్ క్లబ్ సేవలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అభినందించినారు ఇదేవిధంగా ముందు కూడా కార్యక్రమాలు చేపట్టాలని జిల్లాలోని అన్ని ఎన్జీవోలు నేత్రదానం పైన పని చేయాలని కోరినారు

# రీ-సర్వేను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 25.**

జిల్లాలో చేపట్టిన గ్రామాల రీ--సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత కార్యాచరణ ప్రకారం అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని తహసీల్దార్లు, గిర్దావర్లు, గ్రామ పాలనాధికారులకు గ్రామాల రీ--సర్వే ప్రక్రియపై సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రీ--సర్వే ద్వారా గ్రామాల్లోని ప్రతి భూ కమతాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖచ్చితంగా కొలిచి, భూ రికార్డులను నవీకరించడం జరుగుతుందని తెలిపారు. భూ యజమానుల హక్కుల పరిరక్షణతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలను నివారించడమే రీ--సర్వే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రీ--సర్వే ప్రారంభానికి ముందు గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, భూ యజమానులు, పట్టాదారులు, రైతులు, ప్రజాప్రతినిధులకు సర్వే కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, అటవీ భూములు, చెరువులు, కుంటలు, వాగులు, రహదారులు, శ్మశానవాటికలు, ప్రజా అవసరాలకు కేటాయించిన భూములు తదితర సామూహిక ఆస్తులను స్పష్టంగా గుర్తించి రికార్డు చేయాలని ఆదేశించారు. సర్వే సమయంలో రెవెన్యూ రికార్డులు, పాత గ్రామ పటాలు, సేత్వార్, టిప్పన్, ఖాస్రా పహాణీ, ప్రస్తుత భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు మరియు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను సమగ్రంగా



పరిశీలించాలని తెలిపారు. పాత సర్వే నంబర్లు, కొత్త భూ కమతాల మధ్య సంబంధాన్ని తెలియజేసే కోరిలేషన్ స్టేట్‌మెంట్, ఫీల్డ్ రిజిస్టర్, ల్యాండ్ పార్సిల్ మ్యాప్, గ్రామ పటం తదితర రికార్డులను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా రూపొందించాలని సూచించారు. భూ కమతాల కొలతలు పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు నోటీసులు జారీ చేసి, వారి సమక్షంలో హద్దులను నిర్ధారించాలని తెలిపారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లు వచ్చినప్పుడు వాటిని నిర్ణీత గడువులో స్వీకరించి, రికార్డులు మరియు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన తర్వాత నిష్పక్షపాతంగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ పాలనాధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, సర్వే బృందాలకు అవసరమైన భూ రికార్డులు, స్థానిక సమాచారం అందించాలని సూచించారు. గిర్దావర్లు రోజువారీ సర్వే పనులను పర్యవేక్షించాలని, తహసీల్దార్లు మండల స్థాయిలో మొత్తం ప్రక్రియను సమన్వయం చేస్తూ పురోగతిని నిరంతరం సమీక్షించాలని తెలిపారు. రీ--సర్వే అనేది కేవలం భూములను కొలిచే కార్యక్రమం మాత్రమే కాదని, గ్రామంలోని ప్రతి అంగుళం భూమికి సంబంధించిన సమగ్రమైన, శాశ్వతమైన మరియు విశ్వసనీయమైన రికార్డును రూపొందించే కీలక కార్యక్రమమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి రీ--సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో రీ--సర్వేకు సంబంధించిన ముందస్తు కార్యక్రమాలు, గ్రామ సరిహద్దుల నిర్ధారణ, గ్రౌండ్ ట్రూతింగ్, భూ కమతాల కొలత, మ్యాపుల తయారీ, రికార్డుల పరిశీలన, ఫారాలు--రిజిస్టర్ల నిర్వహణ, అభ్యంతరాల పరిష్కారం, తుది భూ రికార్డుల రూపకల్పన తదితర అంశాలను అధికారులకు సవివరంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బి.ఎస్. లత అడిషనల్ కలెక్టర్ (రె) , సంబంధిత జిల్లా అధికారులు, రెవెన్యూ మరియు సర్వే--ల్యాండ్ రికార్డుల శాఖ అధికారులు, తహసీల్దార్లు, గిర్దావర్లు, గ్రామ పాలనాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పచ్చదనమే ప్రగతికి నిదర్శనం.. ఎమ్మెల్యే జారె

● ఊట్లపల్లిలో ఘనంగా వనమహోత్సవం

**అశ్వారావుపేట, ఆగస్టు 25, (ప్రజా తీర్పు)**

మొక్కలు నాటడం ఒక్కటే కాదు.. వాటిని బిడ్డల్లా పెంచి కాపాడితేనే పచ్చదనం వెల్లివిరుస్తుందని, అదే మన భావి తరాలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి అని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు, వినాయకపురం సెక్షన్, అశ్వారావుపేట రేంజ్ పరిధిలోని ఊట్లపల్లి బీట్ లో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేతో పాటు సర్పంచ్ సత్యం లక్ష్మీ కుమారి, ఎంపీడీవో, ఆత్మా కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు పాల్గొన్నారు. రిట్రీవల్ ల్యాండ్ లో 0.7 హెక్టార్ల స్థలంలో టేకు, వెదురు, చింత, నిమ్మ, ఉసిరి వంటి ప్రకృతికి మేలు చేసే వివిధ రకాల మొక్కలను నాటారు, మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన గాలి లభించడమే కాకుండా, భూగర్భ జలాలు పెరిగి, వర్షాలు సకాలంలో కురుస్తాయని, పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని ఎమ్మెల్యే వివరించారు, ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు, శుభకార్యాల సందర్భంగా ఒక్క మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. వనం ఉంటేనే జనం ఉంటారని, అడవులను, వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు, స్థానిక ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ సిబ్బంది భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# 14వ సారి రక్తదానం చేసిన కోరుట్ల బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎండి. ఆమేర్

**కోరుట్ల ఆగస్టు 25 (ప్రజాతీర్పు)**



అత్యవసర సమయంలో రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు కోరుట్లకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎండి. ఆమేర్. కోరుట్ల పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గర్భిణీ స్త్రీకి రాత్రివేళ అత్యవసరంగా అరుదైన ూదీం రక్తం అవసరమైందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండి. ఆమేర్‌కు సమాచారం అందించారు.విషయం తెలిసిన వెంటనే స్పందించిన ఆమేర్, ఎలాంటి ఆలస్యం చేయకుండా మెట్‌పల్లిలోని రాధ్న బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు. ఇది ఆయన 14వ సారి రక్తదానం కావడం విశేషం. అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసిన ఎండి. ఆమేర్‌ను పేషెంట్ బంధువులు హాస్పిటల్ సిబ్బంది అభినందించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి

**కోరుట్ల, ఆగస్టు 25 (ప్రజాతీర్పు)**



కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లోని ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో మంగళవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని జువ్వాడి నర్సింగరావు మర్యాదపూర్వకంగా కలిసి, కోరుట్ల నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, నీటిపారుదల సంబంధిత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలన్న విజ్ఞప్తిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడతామని జువ్వాడి నర్సింగరావు తెలిపారు.



# పచ్చదనాన్ని కాపాడటం ద్వారా సమతుల్య వాతావరణం : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 25**

మొక్కలు నాటి సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమతుల్య వాతావరణాన్ని నిర్మించవచ్చని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండలం బొక్కలగుట్ట ప్రాంతంలోని గాంధారి వనంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా భావితరాలకు సహజమైన సమతుల్య వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. చెట్ల ద్వారా మనకు కావలసిన సహజవాయువు, ఆరోగ్యకరమైన ఆహారం, ఆశ్రయం లభిస్తాయని, వర్షాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంగళవారం రోజున 4 లక్షల మొక్కలను నాటడం జరిగిందని, జిల్లాకు నిర్దేశించిన 41 లక్షల మొక్కల లక్ష్యాన్ని దాదాపు 80 శాతం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించాలని, సమతుల్య వాతావరణ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని ఆర్.కె. గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన రెండు పడక గదుల ఇండ్ల లబ్ధిదారుల లక్కీ డ్రా కార్యక్రమానికి డి.సి.పి., మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాయలింగు, మండల తహసిల్దార్ సతీష్ కుమార్, ఇందిరమ్మ ఇండ్లు పి.డి. బన్సీలాల్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు రెండు పడక గదుల ఇండ్ల పథకంలో ఇండ్లు కేటాయించడం జరుగుతుందని, ఈ క్రమంలో పారదర్శకమైన కేటాయింపు కొరకు అర్హులైన లబ్ధిదారులకు లక్కీ డ్రా నిర్వహించి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు పథకం చేపట్టి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు పడక గదుల ఇండ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా లక్కీ డ్రా పద్ధతిన పారదర్శకంగా ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# బోడు, లచ్చగూడెంలో ఘనంగా వనమహోత్సవం

● లచ్చగూడెంలో 200 పూలు, పండ్ల మొక్కలు నాటిన అధికారులు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 25**

వీబీ --జి రామ్ జి పథకంలో భాగంగా టేకులపల్లి మండలంలోని బోడు, లచ్చగూడెం గ్రామపంచాయతీల్లో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచులు పొదెం స్వరూప, ఎదుల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. గుట్ట చెరువుపై ఈత, ఖర్జూర మొక్కలుబోడు గ్రామపంచాయతీ పరిధిలోని గుట్ట చెరువు ప్రాంతంలో ఈత, ఖర్జూర మొక్కలను నాటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలనిసూచించారు. లచ్చగూడెంలో 200 పూలు, పండ్ల మొక్కలులచ్చగూడెం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో 200 పూలు, పండ్ల మొక్కలను నాటారు. గ్రామపంచాయతీ కార్యాలయ పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. మొక్క నాటడమే కాదు.. సంరక్షణ ముఖ్యంఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వనమహోత్సవం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దడమే అసలు లక్ష్యమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు, వివిధ శాఖల సిబ్బంది హాజరుఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి కార్యాలయం నుంచి అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎన్. రవికుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కొండపల్లి శ్రీదేవి హాజరై బోడు, లచ్చగూడెం గ్రామాల్లో మొక్కలు నాటారు. వీరితో పాటు ఏపీవో, ఈసీలు, పీఎస్‌లు, టీఏలు, ఎఫ్ఏలు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ, ఎస్ఐ, అటవీ శాఖ ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, పోలీస్ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. పచ్చదనంతో గ్రామాల అభివృద్ధివనమహోత్సవంలో భాగంగా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం ద్వారా గ్రామాల్లో పచ్చదనం పెంచడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఇంటి పరిసరాల్లో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రజలు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

# అక్రమాల అడ్డుకట్టకే డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు

● రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 25.**

ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, పటిష్టంగా తీర్చిదిద్దడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందించాలనే లక్ష్యంతో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో ఉన్న నకిలీ, డూప్లికేట్ రేషన్ కార్డులను తొలగించి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే చేరేలా స్మార్ట్ రేషన్ కార్డుల విధానాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో మొత్తం లి80,873 స్మార్ట్ రేషన్ కార్డులులి పంపిణీ చేస్తున్నామని, గొల్లపల్లి మండలంలోని లి34 రేషన్ షాపుల పరిధిలో 15,185 కుటుంబాలకులి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి స్మార్ట్ రేషన్ కార్డుపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దానిని స్కాన్ చేయడం ద్వారా కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను డిజిటల్ విధానంలో తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా రేషన్ సరుకులు పొందేలా పోర్టబిలిటీ సౌకర్యం కల్పించామని, పేదలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు రద్దు కాదని స్పష్టం చేశారు. అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డుల జారీ, వివాహాల అనంతరం కుటుంబ సభ్యుల పేర్ల చేర్పు వంటి ప్రక్రియలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. మండలంలో సుమారు లి17 వేల స్మార్ట్ రేషన్ కార్డులులి పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో అర్హులైన లబ్ధిదారులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి లిరూ.5 లక్షల ఆర్థిక సహాయంలి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. త్వరలో రెండో విడత ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు. అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, 50 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు, తలసేమియా, కిడ్నీ బాధితులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి




ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గొల్లపల్లి మండలంలోని నాలుగు గ్రామాల్లో తొలి విడతగా డిజిటల్ భూ ఆధార సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం భూ సరిహద్దులు, భూమి మ్యాప్‌తో కూడిన 'భూ ఆధార' కార్డులను రైతులకు అందజేయనున్నట్లు చెప్పారు. డిజిటల్ భూ సర్వే ద్వారా భూ వివరాలు మరింత స్పష్టంగా, పారదర్శకంగా నమోదు కావడంతో భూ వివాదాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 80,873 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు గొల్లపల్లి మండలంలో 15,185 కుటుంబాలకు కార్డులు అందిస్తున్న నేపథ్యంలో, ప్రతి అర్హ కుటుంబానికి కార్డు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా, ఎలాంటి జాప్యం లేకుండా అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. రేషన్ కార్డు భవిష్యత్తులో వివిధ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఉపయోగపడే ముఖ్యమైన ప్రామాణిక పత్రంగా మారనుందని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రేషన్ కార్డు నంబర్‌తో యాప్‌లో లాగిన్ అయి ప్రతి నెలా కేటాయించిన సరుకులు, పొందిన సరుకుల వివరాలను లబ్ధిదారులు స్వయంగా పరిశీలించుకోవచ్చన్నారు. రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే యాప్ ద్వారానే నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఏర్పడుతుందని తెలిపారు. డిజిటల్ విధానంతో రేషన్ కార్డుల వివరాలు అందుబాటులో ఉండటం వల్ల లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుతాయని పేర్కొన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలని, అర్హులైన లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధు సూదన్, డీఎస్ఓ జితేందర్ రెడ్డి, , ఎంఆర్ఓ మాజీద్ , ఏఎంసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్, స్థానిక సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలి

- పి డి ఎస్ యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అంగిడి కుమార్.

**జమ్మికుంట ఆగస్టు 25 ప్రజాతీర్పు**




జమ్మికుంట బస్టాండ్ నుండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రీయంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలైనా నేటికీ ప్రజా పాలన అంటూ ఉదరగొట్టడమే తప్ప విద్యార్థులకు ఇచ్చే రియంబర్స్మెంట్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోరు మెదపడం లేదని.పి డి యస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోలా అన్నారు. విద్యార్థులు మా స్కాలర్షిప్,రియంబర్స్మెంట్ మాకు ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు. స్కాలర్షిప్స్ అంటే పాలక ప్రభుత్వాలు కేవలం ఒక సంక్షేమ పథకంలా చూస్తూ నిర్లక్ష్యం చేస్తున్నరు తప్ప అదొక సామాజిక సమస్యగా, సామాజిక బాధ్యతగా చూడడం లేదని అన్నారు. పాలక ప్రభుత్వాలు రేయంబర్స్మెంట్ విషయంలో ఆలస్యం చేయడం కారణంగా విద్యార్థులు పరీక్ష ఫీజులు, పుస్తకాల ఫీజులు,ప్రయాణ కర్చులు,హాస్టల్ ఫీజులు, ల్యాబ్ ఇతర సౌకర్యాల ఖర్చులు కట్టలేని పరిస్థితి ఏర్పడే ఒత్తిడి గురై ఇంజనీరింగ్,మెడికల్, ఫార్మసీ,డిగ్రీ,ఇంటర్ విద్యార్థులు డ్రాపౌట్స్ అవుతూ పై చదువులకు వెళ్లలేక పోతున్నారని అన్నారు. విద్యార్థుల ఖాతాల్లోకి స్కాలర్షిప్స్ వేయడంలో ఆలస్యం కారణంగా పేద విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా ప్రభుత్వ విధానం ఉందని వారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే కమిటీల పేరుతోనే కాలయాపన చేయడం మూలంగా విద్యాసంస్థలు రోడ్డెక్కి బందులు పాటించినా, విద్యార్థులు మంత్రుల ఇండ్లు ముట్టడించిన ప్రభుత్వాలు తీరు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆఖరికి కోర్టులు సైతం చొరవ చేసుకొని విద్యార్థులకు రియంబర్స్మెంట్ ఇవ్వాల్సిందే అని ఆదేశాలు జారీ చేసిన ఏమాత్రం సోయి లేకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం బేఖాతరు చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా పేద విద్యార్థులకు ఆర్థిక సహకారంగా ఉన్న రియంబర్స్మెంట్ ను కొనసాగిస్తూ పెండింగ్ లో ఉన్న 10వేల కోట్లను తక్షణమే విద్యార్థులకు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పిడిఎస్యు నిర్మాణం ,విద్యారంగ సమస్యల పైన క్లాస్ బోధించారు. ఈ కార్యక్రమంలో పి డి యస్ యూ జిల్లా కార్యదర్శి లోకిని మల్లేష్, జిల్లా నాయకులు తాళ్లపల్లి విష్ణు, యశ్వంత్, వంశీ , శ్రీవిద్య, సంజన,అనన్య,తదితరులు పాల్గొన్నారు.



## అశ్వారావుపేటలో... వినాయక చవితి సందడి

- ముస్తాబవుతున్న వివిధ రకాల గణనాథులు
- భక్తి పారవశ్యంలో కొనుగోలుదారులు

**అశ్వారావుపేట, ఆగస్టు 25, (ప్రజా తీర్పు)**

వినాయక చవితి పండుగకు మూడు వారాల సమయం ఉన్నా అశ్వారావుపేటలో గణనాథుల తయారీ జోరుగా సాగుతోంది, విగ్రహ తయారీదారులు వివిధ ఆకారాల్లో, వివిధ భంగిమల్లో ఎంతో రమణీయంగా, వివిధ కలర్లతో ఆకర్షణీయంగా గణపతి విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు, 2 అడుగుల నుంచి 15 అడుగుల వరకు బాల గణపతి, మహారాజా గణపతి, లడ్డూ గణపతి రూపాల్లో సిద్ధమవుతున్న విగ్రహాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. పర్యావరణ హితమైన మట్టి గణపతులకు ఈసారి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో సహజ రంగులతో ముస్తాబు చేస్తున్నారు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను కూడా రంగురంగుల ఆభరణాలతో అలంకరిస్తున్నారు, పండుగకు సమయం ఉన్నా భక్తులు ముందుగానే వచ్చి తమకు నచ్చిన విగ్రహాలను బుక్ చేసుకుంటుండటంతో అమ్మకాలు ఊపందుకున్నాయని తయారీదారులు చెబుతున్నారు.



## పచ్చదనం పెంచుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. భవిష్యత్తును కాపాడుదాం

- ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్

**సిద్దిపేట ఆగస్టు 25 (ప్రజా తీర్పు)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా నంగునూర్ జూనియర్ కాలేజీ ఆవరణలో మంగళవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్, గ్రామ సర్పంచ్ సనాదుల బాల పోచయ్య, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కే. శివకోటి కలిసి కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. నంగునూర్‌ను మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రజలు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కోల శ్రీధర్ గౌడ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నితీష్ కుమార్,, ఫీల్డ్ అసిస్టెంట్ దేవులపల్లి నర్సింగరావు, బీనబోయిన అశోక్, రాగుల అశోక్, సిర్రం భాను, సీఏలు జహీర్,స్వప్న, సుజాత, లావణ్యతో పాటు గ్రామస్థాయి సిబ్బంది మరియు కళాశాల సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.



## రేపల్లెవాడ లెవల్ క్రాసింగ్ వద్ద ROB నిర్మాణానికి జాయింట్ ఇన్స్పెక్షన్

**(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజాతీర్పు, తాండూర్ మండల రిపోర్టర్) ఆగస్టు 25**

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైల్వే లైన్ విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా లెవల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ (=ాదీ), రోడ్డు అండర్ బ్రిడ్జ్ (=ఖదీ), ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ (ఖీూదీ)లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా తాండూర్ మండలంలోని రేపల్లెవాడ--కొత్తపల్లి గ్రామాల మధ్య ఉన్న ాజ-68 రేపల్లెవాడ లెవల్ క్రాసింగ్ వద్ద ప్రతిపాదిత =ాదీ నిర్మాణానికి సంబంధించి మంగళవారం జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు. రేచీని రోడ్--రేపల్లెవాడ స్టేషన్ల మధ్య కిలోమీటర్ 226/12-14 వద్ద ప్రతిపాదించిన =ాదీ నిర్మాణానికి సంబంధించి వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. =ాదీ నిర్మాణానికి అవసరమైన ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్లను పరిశీలించడంతో పాటు, నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే భూములు, ఆస్తులు తదితర వివరాలను అధికారులు నమోదు చేశారు. అలాగే గ్రామ ప్రజలు, గ్రామ పెద్దల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించారు. భూసేకరణ, అలైన్‌మెంట్, ప్రభావిత ఆస్తులు తదితర అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. =ాదీ నిర్మాణం వల్ల స్థానిక ప్రజలకు, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన ప్రత్యామ్నాయ మార్గాలు, చర్యలను కూడా పరిశీలించారు. ఈ జాయింట్ ఇన్స్పెక్షన్‌లో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సుందర్, రైల్వే రోడ్ సెక్టార్ ప్రాజెక్ట్ భూసేకరణ నిపుణులు పి. దేవరాజు, ×జుూాణ మనోజ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ ఐఏఎస్, తాండూర్ తహసీల్దార్ యు. జ్యోత్స్న, తాండూర్ మండల ఎంపీడీవో పి. శ్రీనివాస్, చీనాా×, =డదీ, అటవీ, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ దుర్గాదేవి ఆలయంలో ఘనంగా మంగళగౌరీ వ్రతం

**కోరుట్ల, ఆగస్టు 25 (ప్రజాతీర్పు):**



పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కోరుట్ల పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్‌లో ఉన్న శ్రీ దుర్గాదేవి ఆలయంలో మంగళగౌరీ వ్రతాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తమ పసుపు, కుంకుమలు చల్లగా ఉండాలని కోరుకుంటూ మహిళలు అధిక సంఖ్యలో సామూహికంగా మంగళగౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మంగళహారతులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ పాలెపు రాముశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెండెం గణేష్, అర్చకులు వినయ్ శర్మ, మున్సిపల్ కౌన్సిలర్ శీలం జయలక్ష్మి, ఆలయ నిర్వాహకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రావణమాసంలో మంగళగౌరీ వ్రతాన్ని సామూహికంగా నిర్వహించడం ద్వారా మహిళల్లో భక్తిభావం, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు

## మోడల్ స్కూల్ కు క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి

- మంత్రి అడ్లూరి హామీ ఇచ్చి, అమలు మరిచారు
- వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఆగస్టు 25:**



జగిత్యాల జిల్లా వెల్కటూర్ మండలం కుమ్మరిపల్లె మోడల్ స్కూల్ విద్యార్థులకు క్రీడల పై ఆసక్తి ఉన్న క్రీడా మైదానం లేకపోవడంతో ఆడ లేక పోతున్నారని, మోడల్ స్కూల్ ప్రాంగణంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ ఓ ప్రకటనలో కోరారు. మోడల్ స్కూల్ లో సుమారు ఏడువందల అరవై ఎనిమిది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు . ఫలితాల్లో జిల్లాలోనే టాప్ వన్ స్థానం లో ఉండగా క్రీడల్లో వెనుకబడిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. గత రెండు మాసాల క్రితం పాఠశాలను సందర్శించిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు క్రీడ మైదానం ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చి, అమలు పరచడం మరిచారని గుర్తు చేశారు. పాఠశాల పక్కనే క్రీడా మైదానానికి సరిపడే స్థలం ఉన్నందున మంత్రిగారు ఇప్పటికైనా స్పందించి చొరవ తీసుకొని విద్యార్థుల సౌకర్యార్థం క్రీడ మైదానం ఏర్పాటుకు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.



## ఎండపల్లి, వెల్గటూర్ మండలాల ఒగ్గు కళాకారులకు సన్మానం

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఆగస్టు 25:**



ఒగ్గు కథ యూనివర్స్ 2025 ఆనర్స్ ప్రపంచ జానపద దినోత్సవం- 2026 సందర్భంగా తెలంగాణ సహజీవ జానపద వారసత్వ వేడుక లో ఒగ్గు కథ తెలంగాణకు చెందిన సుసంపన్నమైన, సజీవమైన జానపద కళా వారసత్వాన్ని ఘనంగా చాటిచెప్పే ఉద్దేశంతో హైద్ రాబాద్ విశ్వవిద్యాలయం -- జానపద సంస్కృతి అధ్యయన కేంద్రం, హైదరాబాద్ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం, సహకారంతో "ఒగ్గు కథ యూనివర్స్ 2025 ఆనర్స్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద కళారంగానికి విశేష సేవలందిస్తూ, తరతరాలుగా ఒగ్గు కథ సంప్రదాయాన్ని కాపాడుతూ, ప్రజల్లోకి తీసుకెళ్తున్న ఒగ్గు కళాకారుల్లో రాష్ట్రవ్యాప్తంగా 25 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన ఒగ్గు కళాకారుల్లో జగిత్యాల జిల్లాఎండపల్లి మండల కేంద్రానికి చెందిన నక్క సత్తయ్య యాదవ్, నక్క శివరాం యాదవ్, వెల్గటూర్ మండలం లోని పైడిపల్లి, ముత్తునూర్ గ్రామాలకు చెందిన గాలి పర్వతాలు యాదవ్, దాసరి ఐలయ్య ఉన్నారు. సభా వేదికపై నిర్వాహకులు వీరిని శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తమ ప్రతిభను గుర్తించి అవకాశం కల్పించిన డా. జి కుమారస్వామి కి ఒగ్గు కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒగ్గు కథ కళాకారుడు, జీమా ఫోక్ ఇంచార్జ్ సింగారపు రాజ్ కుమార్ యాదవ్, వెల్గటూర్,ఎండపెల్లి మండలాల జీమా కో ఆర్డినేటర్స్ గాలి హరీష్ యాదవ్,నక్క శివరామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ రాజన్న ఆలయంలో కోడెల మరణాలు.. భక్తుల మనోభావాలతో ఆటలాడుతున్నారా?

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్టు 25**



తెలంగాణలోనే ప్రత్యేకమైన సంప్రదాయంగా పేరుగాంచిన కోడెమొక్కు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ప్రత్యేక గుర్తింపు. ఇంట్లో ఏ శుభకార్యం ప్రారంభించినా, రాజన్నను దర్శించుకున్న అనంతరం కోడెమొక్కు చెల్లించుకోవడం అనేక మంది భక్తులు తరతరాలుగా పాటిస్తున్న సంప్రదాయం. అయితే ఇంతటి పవిత్రమైన సంప్రదాయానికి సంబంధించిన కోడెల సంరక్షణ విషయంలో ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత దాదాపు పదేళ్లుగా కోడెల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని భక్తులు, ప్రజా సంఘాలు, దేవాదాయ శాఖ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని విమర్శలు వస్తున్నాయి. ప్రతి వారం పదుల సంఖ్యలో కోడెలు మృత్యువాత పడుతున్నాయనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా ఒకే రోజు ఐదు కోడెలు మృతి చెందినట్లు ఆరోపణలు రావడంతో భక్తుల్లో ఆందోళన నెలకొంది. కోడెమొక్కు రాజన్న ఆలయానికి ప్రధాన సంప్రదాయం, ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైనా, కోడెల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శకులు ఆరోపిస్తున్నారు. కోడెల మరణాల విషయాన్ని బయటకు రానివ్వకుండా ఆలయ అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం భక్తుల మనోభావాలను, మత విశ్వాసాలను దెబ్బతీసేలా ఉందని ఆగ్రహం వ్యక్తమవుతోంది. గతంలో దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తాజాగా మృతి చెందిన కోడెల ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇకపై కూడా ఇదే పరిస్థితి కొనసాగితే హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. భక్తుల విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన కోడెమొక్కు సంప్రదాయాన్ని కాపాడటం ఎవరి బాధ్యత? కోడెల సంరక్షణపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు?

బైట్: బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ

# నషా ముక్త్ భారత్ అభియాన్‌పై 'వార్త' మీడియా వర్క్‌షాప్

- మహేశ్వరంలో నిర్వహించిన పీఐబీ–హైదరాబాద్

**(వినోద్, ప్రజా తీర్పు, హైదరాబాద్, మేడ్చల్ జిల్లా) ఆగస్టు 25,**




పత్రికా సమాచార కార్యాలయం– హైదరాబాద్ ఆధ్వర్యంలో.. మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ)' కార్యక్రమంపై రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మీడియా ప్రతినిధులకు 'వార్త' మీడియా వర్క్‌షాప్‌ను ఈ రోజు నిర్వహించారు. మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీ కె. నారాయణ రెడ్డి (ఐపీఎస్) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈగల్ ఫోర్స్ పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ రావుల గిరిధర్ (ఐపీఎస్), పీఐబీ– హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, మహేశ్వరం ఎంపీడీవో శ్రీమతి ఎన్. శారదమ్మ ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీ కె. నారాయణ రెడ్డి (ఐపీఎస్) మాట్లాడుతూ.. "డ్రగ్స్ భూతాన్ని ఎదుర్కొనేందుకు చట్టపరమైన ఆంక్షలు మాత్రమే సరిపోవు.. ప్రజలందరి భాగస్వామ్యంతోనే దాన్ని సమర్థంగా కట్టడి చేయగలం" అన్నారు. మాదకద్రవ్యాల సరఫరా, సంబంధిత కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా.. ఎస్ఐడీ, ఆక్టోపస్, సీఐఎస్ఎల్, ఈగల్ ఫోర్సుల వంటి బలమైన ప్రత్యేక బలగాలతోపాటు స్థానిక పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందన్నారు. మాదకద్రవ్య నివారణ చర్యలు ఇళ్లలోనే, బడుల్లోనే మొదలుకావాలన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, సహచరులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సకాలంలో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా డ్రగ్స్ ముప్పును సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను కాపాడుకోవడాన్ని శాంతిభద్రతల అంశంగా మాత్రమే చూడలేమన్నారు. వారి ఆరోగ్యాన్నీ, నైపుణ్యాన్నీ, సామర్థ్యాన్నీ పెంపొందించడంలోనూ ఇది అత్యావశ్యకమన్నారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాలు.. నేడు దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా మారాయని కె. నారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. మాదకద్రవ్య రహిత భారత్ నిర్మాణం దిశగా ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ధ్రువీకృత సమాచారాన్ని ప్రసారం చేయాలనీ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను చెప్పాలనీ, డ్రగ్స్ బారిన పడకుండా యువతను ముందస్తుగానే జాగరూకులను చేయాలనీ, కౌన్సెలింగ్ – పునరావాస సేవలపై ప్రజలకు తగిన సమాచారాన్ని అందించాలనీ మీడియా సిబ్బందిని ఆయన కోరారు.

### మాదకద్రవ్యాలను అరికట్టే దిశగా సమన్విత చర్యలను వివరించిన ఈగల్ ఫోర్స్ ఎస్పీ

'నషా ముక్త్ భారత్ అభియాన్'పై అవగాహన సదస్సులో తెలంగాణ ఈగల్ ఫోర్స్ పోలీసు సూపరింటెండెంట్ శ్రీ రావుల గిరిధర్ (ఐపీఎస్) మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత, కుటుంబ సమస్య స్థాయిని దాటి.. నేడు తీవ్రమైన సామాజిక, శాంతిభద్రతల, జాతీయ భద్రతా సవాలుగా పరిణమించిందన్నారు. ఈ ముప్పును ఎదుర్కొనే దిశగా సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నీ సమన్వయంతో కృషి చేయాలన్నారు. జనవరి నుంచి తెలంగాణలో దాదాపు 8 వేల కేజీల గంజాయిని ఈగల్ ఫోర్స్ సీజ్ చేసిందని ఆయన తెలిపారు. దాదాపు 22 రకాల శిక్షణ కార్యక్రమాల ద్వారా 30 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికీ, ఇతర శాఖల అధికారులకూ శిక్షణ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సమన్విత చర్యల్లో మీడియా సిబ్బంది పాత్ర అత్యంత కీలకమైనదని శ్రీ రావుల గిరిధర్ అన్నారు. బాధ్యతాయుతమైన, సున్నితత్వంతో కూడిన రిపోర్టింగ్ ద్వారా.. యువతలో అవగాహనను పెంపొందించవచ్చనీ, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చనీ, పునరావాస చర్యలను ప్రోత్సహించవచ్చనీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులను నివేదించేటప్పుడు కచ్చితత్వాన్నీ, సున్నితత్వాన్నీ దృష్టిలో పెట్టుకోవాలని మీడియా సిబ్బందిని కోరారు. ముఖ్యంగా మైనర్ల వివరాలను గోప్యంగా ఉంచాలనీ, మాదకద్రవ్యాల బారిన పడ్డవారి వ్యక్తిగత వివరాలను అనవసరంగా బహిర్గతం చేయొద్దనీ సూచించారు. నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనలో.. పోలీసులు – మీడియా మధ్య బలమైన సమన్వయం, జాగరూకతతో కూడిన ప్రజల భాగస్వామ్యం అత్యావశ్యకమని ఆయన వ్యాఖ్యానించారు. పీఐబీ–హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ ప్రారంభోపన్యాసం చేశారు. "డ్రగ్స్ ముప్పు ఇకపై వ్యక్తిగత సమస్యో, కుటుంబ సమస్యో కాదనీ, నేడు ఇదొక తీవ్రమైన సామాజిక, శాంతిభద్రతల, జాతీయ భద్రతా సవాలుగా పరిణమించింది" అని ఆయన అన్నారు. 'వార్త' వర్క్‌షాప్ ద్వారా.. కచ్చితమైన సమాచారమూ, బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ విధానాలతో జర్నలిస్టులను సన్నద్ధులను చేయడమే పీఐబీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తద్వారా వారు నషా ముక్త్ భారత్ అభియాన్‌కు అర్థవంతంగా దోహదపడి, మాదకద్రవ్యాల వ్యాప్తిని నివారించడంలో దోహదపడతారన్నారు. అనంతరం వక్తలతో... జర్నలిస్టులు మాట్లాడారు. కార్యాచరణ సమస్యలు, పునరావాస సేవల లభ్యత, మాదకద్రవ్యాల సంబంధిత కథనాల రిపోర్టింగ్ వంటి విషయాలపై వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పీఐబీ– హైదరాబాద్ మీడియా– కమ్యూనికేషన్ అధికారి శ్రీమతి వర్గంటి గాయత్రి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 60 మంది మీడియా ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## గొల్లపల్లి మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ ) ఆగస్టు25**

మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్ కార్డు ఎంతో కీలకమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు సకాలంలో అందేలా రేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గొల్లపెల్లి మండలంలో 34 రేషన్ షాపుల పరిధిలో సుమారు 17 వేల రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు మరింత సులభంగా అందనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రావణమాసం కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు మైనంపల్లి

**(వినోద్, ప్రజా తీర్పు,మల్కాజిగిరి, ప్రతినిధి) ఆగస్టు 25**

శ్రావణమాసం రెండవ మంగళవారం సందర్భంగా మల్కాజిగిరిలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని రకరకాల పండ్లతో తో సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని కుంకుమార్చనతో పాటు లలిత సహస్రనామ పారాయణం చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కుమారుడు మైనంపల్లి శివం రావు కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ సుబ్బయ్య, కుషాయిగూడ ఏసీపీ చక్రపాణి, మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ విజయ్, ఎస్సై గణేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు 535 దరఖాస్తులు

**రామడుగు/గంగాధర, ఆగస్టు 25 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

గంగాధర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి మొత్తం 535 దరఖాస్తులు స్వీకరించినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనను సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వారి ప్రకటన ప్రకారం నారాయణపూర్ అంగన్‌వాడీ కేంద్రానికి 16, లింగంపల్లికి 21, కురిక్యాల2కు 17, వెంకటయ్యపల్లికి 32, దేశ్‌రాజ్‌పల్లి1కు 49, పందికుంటకు 6, వన్నారం2కు 34, రాజాజీనగర్‌కు 18, రామడుగు2కు 8, తిరుమలాపూర్2కు 7, కారుపాకలపల్లికి 2, గోపాల్‌రావుపేట2కు 29, రుద్రారం2కు 64, దత్తోజిపేటకు 29, చొప్పదండి1 (వార్డు13)కు 62, చొప్పదండి4 (వార్డు7)కు 63, రుక్మాపూర్1కు 5, కాట్నపల్లి2కు 38, చొప్పదండి6 (వార్డు3)కు 27, చొప్పదండి10 (వార్డు5)కు 8 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన సెప్టెంబర్ 1న, 2న, 3న మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో సమర్పించిన వివరాలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు విద్యార్హత, కులం, రిజర్వేషన్, స్థానికత తదితర సంబంధిత ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులతో నిర్ణీత తేదీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని, నిర్ణీత తేదీలో హాజరుకాని వారికి తదుపరి అవకాశం కల్పించబోమని ప్రకటనలో స్పష్టం చేశారు.



## వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్ట్ 25**

వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని డీఎస్పీ ఏ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. వీరప్రసాద్, ఎస్సై రాహుల్ రెడ్డి, ముస్లిం మత పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబీ పండుగను శాంతియుత వాతావరణంలో, సోదరభావంతో నిర్వహించుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో మత పెద్దలు, కమిటీ సభ్యులు, ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

## కలిసొచ్చే కాలం... నడిచొచ్చే పదవి: వేములవాడ ఎమ్మెల్యేకు మంత్రి యోగం?

- కొండ సురేఖ వివాదాల వేళ ఆది శ్రీనివాస్ కు దక్కనున్న దేవాదాయ శాఖ?
- రేవంత్ ఆత్మీయుడికి కేబినెట్ బెర్త్ దాదాపు ఖరారు అంటూ చర్చ!

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్ట్ 25**



తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండ సురేఖ చుట్టూ ముసురుకున్న వివాదాలు రోజురోజుకూ ముదిరిపాకాన పడుతున్నాయి. ఇటీవల ఆమె కుమార్తె కొండ సుస్మిత పార్టీ అధిష్ఠానాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని ఉద్దేశించి బహిరంగంగా చేసిన తీవ్ర వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. గతంలోనూ పలు అనవసర వివాదాలతో పార్టీని ఇరకాటంలో పెట్టిన చరిత్ర ఉండటంతో, ఈసారి ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని సొంత పార్టీ శాసనసభ్యులే ముఖ్యమంత్రిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ?ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టాలని రేవంత్ రెడ్డి సర్కారు భావిస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. కొండ సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించి, ఆ స్థానంలో వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు అవకాశం కల్పించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. బీసీ సామాజికవర్గానికి చెందిన సురేఖ స్థానంలో మరొక బలమైన బీసీ నేతను తీసుకోవడం ద్వారా సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా చూసుకోవచ్చని అధిష్ఠానం భావిస్తోంది. ?కలిసొచ్చే కాలానికి నడిసొస్తున్న మంత్రి పదవి అన్నట్లుగా, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కేబినెట్ యోగం దాదాపు ఖరారైనట్లే కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, బీసీ కమ్యూనిటీలోని మున్నూరు కాపు వర్గం నుంచి అసెంబ్లీలో అధికార పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బలమైన ఏకైక ఎమ్మెల్యేగా ఉండటం ఆది శ్రీనివాస్‌కు కలిసివచ్చే ప్రధాన అంశంగా మారింది. పార్టీకి సుదీర్ఘకాలంగా విధేయుడిగా ఉంటూ, ఎలాంటి వివాదాలు లేకుండా ప్రజాదరణ పొందుతున్న ఆయనకు మంత్రి పదవి ఇస్తే ఉత్తర తెలంగాణలో పార్టీ ఇమేజ్ మరింత పెరుగుతుందని కాంగ్రెస్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ క్రమంలోనే సురేఖపై వేటు వేసి, ఆది శ్రీనివాస్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడంపై త్వరలోనే అధికారిక నిర్ణయం వెలువడే అవకాశం ఉందని రాష్ట్రంలో ఒకటే చర్చ నడుస్తుంది.



## పెగడపల్లిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు

**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్ )ఆగస్టు 25**

జగిత్యాల జిల్లాపెగడపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా సుమారు రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా భవనం ద్వారా చిన్నారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.అనంతరం మండల ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య పరిరక్షణ వంటి సేవలు అందుతున్నాయని పేర్కొన్నారఅర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ పెగడపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

## ఎంచుకున్న లక్ష్యాన్ని సంకల్పం, క్రమశిక్షణతో సాధించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 25**



ఎంచుకున్న లక్ష్యాన్ని సంకల్పం, క్రమశిక్షణతో సాధించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో జిల్లా కలెక్టర్, రామగుండం పోలీస్ కమిషనర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిపుణ ఎస్.ఐ., పి.సి. ఉచిత శిక్షణ కేంద్రాన్ని రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝూ, డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, ఎ.ఆర్.ఎస్.ఐ. సంపత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండే పోలీసు శాఖలో ఎస్.ఐ., పి.సి. పోస్టుల కొరకు అందిస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉత్తమ శిక్షకుల ద్వారా శిక్షణ అందించడం జరుగుతుందని, అభ్యర్థులు ఏకాగ్రతతో నేర్చుకొని సిలబస్ పూర్తి చేయాలని, అవసరమైన మెటీరియల్ అందించడం జరుగుతుందని తెలిపారు. పోటీ పరీక్షలకు పూర్తి నైపుణ్యత కలిగి ఉండాలని, ఈ క్రమంలో జరిగే ప్రిలిమ్స్ పరీక్షలలో 10 వేల మంది ఎంపిక అయితే 2 వేల లోపు ఉండాలని, మెయిన్స్ లో 2 వేలకు 1 వేయి లోపు ఉండాలని, ఆ దిశగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని సన్నద్ధం కావాలని తెలిపారు. ప్రతి సబ్జెక్టులో పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్రమం తప్పకుండా తరగతులకు హాజరై నైపుణ్యత పెంపొందించుకోవాలని తెలిపారు. ఉచిత శిక్షణ, ఉచిత పోటీ పరీక్షలకు తప్పనిసరిగా హాజరై వ్యక్తిగతంగా సామర్థ్యాన్ని తెలుసుకోవాలని, సబ్జెక్టులోని ప్రతి అంశంపై పట్టు సాధించాలని, ప్రతి విషయాన్ని నోట్ చేసుకోవాలని తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ పరీక్షలకు ప్రతి రోజును కౌంట్ డౌన్ చేసుకోవాలని, సెలవుతో సంబంధం లేకుండా శిక్షణకు హాజరై నైపుణ్యత, సామర్థ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు. దినసరి అలవాట్లను మార్చుకోవాలని, శిక్షణపై ఏకాగ్రత పెంచుకోవాలని, ప్రతిరోజు నేర్చుకోవాలని తెలిపారు. లక్ష్యాన్ని సాధించేందుకు సంకల్పంతో ముందడుగు వేయాలని, ప్రతి పనిలో నైపుణ్యత కలిగి ఉండాలని తెలిపారు. ఉన్నత స్థానాలను సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మాదారం-3 ఇంక్లైన్‌లో ఘనంగా వన మహోత్సవం

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజాతీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) ఆగస్టు 25**

మాదారం--3 ఇంక్లైన్ గ్రామపంచాయతీ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చందనాల రవికుమార్ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతపూరి మల్లేశ్వరి, గ్రామపంచాయతీ కార్యదర్శి మాసాడి కృష్ణయ్య, వార్డు సభ్యులు వాసాల సాయి కుమార్, కురుసంగా తిరుపతి, తెలంగాణ రాజ్యాధికార పార్టీ తాండూర్ మండల అధ్యక్షుడు, నాలుగో వార్డు సభ్యుడు వాసాల అనిల్ కుమార్ పాల్గొన్నారు. అలాగే చందనాల కిషోర్, కిష్టయ్య, మురళి, సీపీఐ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి వాసాల నాగరాజు, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను సంరక్షించాలని వారు కోరారు.



# పిఆర్టీయు(టిఎస్) ఎండపల్లి మండల నూతన కార్యవర్గ నియామకం

**( ఎలుక భగవాన్ యాదవ్,ప్రజాతీర్పు ఎండపల్లి) ఆగస్టు 25:**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని రాజారాం పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో పిఆర్టీయు (టి ఎస్) ఎండపల్లి మండల కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పి ఆర్ టి యు టి ఎస్ ఎండపల్లి మండల సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల సమస్యలు,పరిష్కార మార్గాలు మొదలైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సంఘం జగిత్యాల జిల్లా శాఖ ఆదేశానుసారం నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి మునిందర్ గారి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షునిగా జోగం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బైరిశెట్టి ధర్మేందర్, అసోసియేట్ అధ్యక్షునిగా సాయి ప్రశాంత్,మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా అరుణశ్రీ ,ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు , మహిళా ఉపాధ్యక్షురాలుగా సి హెచ్.శైలజ ,మండల కార్యదర్శిగా దెందుకూరి జగన్నాథరావు, మహిళా కార్యదర్శిగా స్రవంతి లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మామిడి సంతోష్ శ్రీనివాస రెడ్డి,వెంకట్రాం, మేక శ్రీనివాస్,చోటేమియా,శంకర్, సంతోష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీలో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం

**నర్సంపేట ఆగస్టు 25 (ప్రజా తీర్పు న్యూస్ ప్రతినిధి )**



నర్సంపేట: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎ+టాజెఔ=జుఃఖా) జూనియర్ కళాశాల బాలుర, నర్సంపేటలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంగేపు కుమారస్వామి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో విద్యార్థులు, సిబ్బంది కలిసి 60కి పైగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంగేపు కుమారస్వామి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కల పెంపకం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. విద్యార్థులు మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు.

# వన మహోత్సవం కార్యక్రమం

- మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్



**జమ్మికుంట ఆగస్టు 25 ప్రజాతీర్పు**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట పట్టణ పరిధిలోని శ్రీ మల్లికార్జున స్వామి (దుబ్బ మల్లన్న) దేవాలయ ఆవరణంలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ. ప్రతి ఒక్కరూ కూడా తమ ఇంటి ఆవరణంలో మొక్కలు నాటాలని తల్లి జన్మనిస్తే చెట్టు పునర్జన్మనిస్తుందని గుర్తు చేశారు. ప్రస్తుత కాలుష్య వాతావరణం లో మన ఇంటి చుట్టూ ఎన్ని మొక్కలు ఉంటే అంత గాలివీస్తుందని తద్వారా మనం ఆరోగ్యకరంగా ఉంటామని అందుకోసమే విధిగా ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణంలో పండ్ల మొక్కలు, పూల మొక్కలు నాటి మీరు మీ కుటుంబమే కాకుండా చుట్టుపక్కల వారు కూడా ఆరోగ్యకరంగా ఉండేలా చెట్లు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ , కౌన్సిలర్స్ దేవాలయ చైర్మన్ ముద్దమల్ల రవి, కమిటీ సభ్యులు, సైదాబాద్ సర్పంచ్ రాజారాం శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆర్ ఐ భాస్కర్,వార్డు ఆఫీసర్స్,బిల్ కలెక్టర్స్,కార్యాలయ సిబ్బంది, ఆర్ పి లు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# రామలింగేశ్వర దేవాలయానికి అన్నపూర్ణ పురస్కారం రావడం పట్ల హర్షం

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 25**

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని విద్యానగర్ శ్రీ రామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప, ఆంజనేయస్వామి వారి దేవాలయంకు దక్షిణ భారత దేశంలో ప్రముఖ దేవాలయాలకు మహాశాస్త్ర సేవా సంఘం అందించే ప్రతిష్టాత్మకమైన అన్నపూర్ణ పురస్కారం రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ మంగళవారం ఆ దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ అనంతుల రామలింగయ్య సాలమ్మ దంపతుల ఆధ్వర్యంలో 1979లో శివాలయ నిర్మాణం జరిగిందన్నారు. ఆ తర్వాత 2007లో దేవాలయ ధర్మకర్తలు, భక్తుల సహకారంతో త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయస్వామి వారి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. నాటి నుండి దేవాలయంలో భక్తుల సహకారంతో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఎంపిక చేసిన 12 దేవాలయాల్లో జిల్లా కేంద్రానికి చెందిన తమ



దేవాలయం ఉండటం గర్వకారణమని అన్నారు. దేవాలయ ప్రధాన అర్చకులు రేంటాల సతీష్ కుమార్ శర్మ దేవాలయంలో నిర్వహిస్తున్న విశేష పూజలతో పాటు ఆయన చేస్తున్న కార్యక్రమాలను గుర్తించిన సంఘం గురుపురస్కారం అందజేయటం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అనంతుల గణేష్ రామలింగయ్య, దేవాలయ ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల లక్ష్మయ్య దత్తపుత్రుడు అనంతుల శ్రీనివాస్ గౌడ్,సందీప్, యుగేందర్, శివ, సుజాత, హంసవేణి,ఆలయ కమిటీ సభ్యులు తెడ్ల ప్రభాకర్, ఉపేందర్ రావు, వాసుదేవరావు, పెద్దిరెడ్డి భరత్, తోట శ్యాంప్రసాద్ రాజయ్య, భాస్కర్,చల్లా లక్ష్మీకాంత్,నాగుబండి లక్ష్మీకాంత్, అర్చకులు దుర్గాప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




# రూ. 2 లక్షల విలువైన నిషేధిత గుట్కా, అంబార్ స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు
- ప్రజా తీర్పు వార్తకు స్పందించిన అధికారులు

**నర్సంపేట రూరల్,ఆగస్టు 25, ప్రజా తీర్పు ప్రతినిధి:**

నర్సంపేట పట్టణంలో అక్రమంగా నిషేధిత గుట్కా, అంబార్ విక్రయిస్తున్న స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి దాదాపు రూ. 2 లక్షల విలువైన సరుకును స్వాధీనంచేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న రెండు షాపుల్లో పెద్ద ఎత్తున నిషేధిత గుట్కా, అంబార్ ప్యాకెట్లను నిల్వ ఉంచి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం నర్సంపేట పోలీసులకు అందింది. ఈ మేరకు సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అరుణ్ తమ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం సదరు షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో:భూపతి రాజు అనే వ్యక్తికి చెందిన షాపులో సుమారు రూ. 1,80,000 విలువైన గుట్కా, అంబార్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. బొప్పారతి సురేందర్ అనే వ్యక్తికి చెందిన షాపులో సుమారు రూ. 25,000 విలువైన నిషేధిత ఉత్పత్తులను పట్టుకున్నారు. మొత్తంగా రూ. 2,05,000 విలువైన సరుకును జప్తు చేసి, ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ప్రజారోగ్యానికి హాని కలిగించే గుట్కా, అంబార్ వంటి నిషేధిత పదార్థాలను విక్రయిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పట్టణంలో అక్రమ దందాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అరుణ్ స్పష్టం చేశారు.

# గ్రామ కార్యదర్శిపై సర్పంచ్ దాడి బోటి మీది తండలో

**నర్సంపేట టౌన్ ఆగస్టు 25 ప్రజా తీర్పు ప్రతినిధి**



నర్సంపేట నియోజకవర్గ వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బోటిమీది తండాలో గ్రామ కార్యదర్శి పై సర్పంచ్ చేసిన దాడి గ్రామంలో తీవ్ర కలకలం రేపుతుంది. తనను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ, పిడిగుద్దులతో విరుచుకుపడ్డారని బాధితుడు రవి మీడియా ముందు వాపోయారు . అయితే గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలో ఉన్న మొక్కలను గ్రామ కార్యదర్శికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, సర్పంచ్ భాను ప్రసాద్ పంచాయతీ సిబ్బందితో కలిసి నరికించి వేశారు. ఈ అక్రమ ఉదంతంపై కార్యదర్శి ఆవుల రవి ఉన్నతాధికారి అయిన ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనపై ఫిర్యాదు చేశాడనే కక్షతోనే సర్పంచ్ భాను ప్రసాద్ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. సర్పంచ్ దాడిపై స్పందించిన బాధితుడు రవి, ఈ విషయమై ఖానాపురం ఎంపీడీవో, స్థానిక ఎస్సై, నర్సంపేట ఏసీపీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ విధుల్లో ఉన్న తనపై అకారణంగా దాడి చేసి, దుర్భాషలాడిన సర్పంచ్ భూక్య భాను ప్రసాద్‌పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు మరియు తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన ఉన్నతాధికారులను వేడుకున్నారు



# పౌల్ట్రీ ఫామ్ నిర్మాణాలు ఆపాలని ప్రజావాణిలో ఫిర్యాదు

**కొప్పరపు రాజిరెడ్డి ప్రజా తీర్పు ప్రతినిధి, ఆగస్టు 25**

బెజ్జంకి మండలంలోని పోతారం చిలపూర్ గ్రామ శివారులో చిలాపూర్ గ్రామానికి చెందిన ప్రభావతి భర్త సత్యనారాయణ, మరియు రమా భర్త రామ్ రెడ్డి 760/ఏ, 83/బి, 83/ఎ సర్వే నెంబర్లో 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న పౌల్ట్రీ ఫామ్ లను నిర్మిస్తున్నారు. దీనిని వెంటనే బందు చేయాలని చిలాపూర్ గ్రామస్తులు సోమవారం మండల కేంద్రంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలో పంట పొలాల పక్కన నిర్మించనున్న పౌల్ట్రీ ఫామ్ తో దుర్వాసన, కాలుష్యం, ఈగలు, దోమలతో ప్రజలు ఇబ్బంది గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పంట పొలాల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మిలాద్ ఉన్ నబీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి




**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 25**

మిలాద్ ఉన్ నబీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ తిరుపతి లు సూచించారు. పండుగను పురస్కరించుకుని ముస్లిం మత పెద్దలతో టేకులపల్లి పోలీస్ స్టేషన్ లో సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దుండిగల్ వేస్ట్ టు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మొక్కలు నాటిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**(వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్ జిల్లా ప్రతినిధి) ఆగస్టు 25**

పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ పేరుకొన్నారు. దుండిగల్ వేస్ట్ టు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణంలో పరిశ్రమల శాఖ మరియు ఫ్యాక్టరీల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారిశ్రామిక ప్రాంతాలలో కాలుష్య నివారణకు ప్రణాళికాబద్ధంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ సమతుల్యత కోసం పరిశ్రమల యాజమాన్యాలు కూడా సామాజిక బాధ్యతగా సీఎస్ఆర్ వనమహోత్సవం లాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి. వినయ్ కుమార్ -- జాయింట్ డైరెక్టర్/జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ, మనోహర్ రెడ్డి -- డిప్యూటీ



చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పరిశ్రమల శాఖ, వీరితో పాటు దుండిగల్ వేస్ట్ టు ఎనర్జీ సంస్థ ప్రతినిధులు రమేష్, గోపినాథ్,సిబ్బంది మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ బుధరావుపేటలో నేత్రపర్వంగా 'వన మహోత్సవం

- పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మొక్కల నాటే కార్యక్రమం



**నర్సంపేట రూరల్, ఖానాపూర్, ఆగస్టు 25, ప్రజా తీర్పు ప్రతినిధి:**

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని చాటిచెబుతూ తెలంగాణ మోడల్ స్కూల్ , జూనియర్ కాలేజ్, బుధరావుపేట ప్రాంగణంలో "వన మహోత్సవం" కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి, వాటిని దత్తత తీసుకుంటున్నట్లు సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు.

### పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాలేజ్ ప్రిన్సిపల్ పెరక సునిత మాట్లాడుతూ, కేవలం మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా వాటిని చెట్లుగా మార్చే వరకు సంరక్షించడమే అసలైన కర్తవ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రకృతి ప్రేమను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

### అధికారులు,ప్రజాప్రతినిధుల సందేశం ఎమ్మార్వో రమేష్

భూగర్భ జలాలు పెరగాలన్నా, స్వచ్ఛమైన ఆక్సిజన్ అందాలన్నా చెట్ల పెంపకం అత్యంత ఆవశ్యకమని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కనైనా నాటి బాధ్యతగా పెంచాలని సూచించారు.

### ఫారెస్ట్ ఆఫీసర్ (డీఆర్ఓ) సుధాకర్

భవిష్యత్ తరాలకు మనం ఇచ్చే గొప్ప కానుక పచ్చని పర్యావరణమేనని, అడవుల రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఎస్సై రామ్మోహన్: పర్యావరణ పరిరక్షణ అనేది ఒక సామాజిక బాధ్యత అని, విద్యార్థులు తమ ఇళ్లలో, గ్రామంలో మొక్కల పెంపకంపై చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు.

అలరించిన విద్యార్థుల నినాదాలు: ఈ సందర్భంగా విద్యార్థులు "మొక్కలు నాటుదాం -- పర్యావరణాన్ని కాపాడుదాం" అంటూ చేసిన నినాదాలు ప్రాంగణంలో ఉత్సాహాన్ని నింపాయి. నాటిన మొక్కలకు స్వయంగా నీరు పోసి, వాటి ఎదుగుదలకు నిరంతరం కృషి చేస్తామని విద్యార్థులు మాటిచ్చారు. ముఖ్య అతిథుల భాగస్వామ్యం: ఈ వేడుకలో సర్పంచ్ పెసరు రాణి గోవర్ధన్ రెడ్డి, ఉపసర్పంచ్ సింగ్ సుధాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణవేణి, కమిటీ సభ్యులు యెల్ల గౌడ్, వార్డు సభ్యులు, అధ్యాపక బృందం, గ్రామ ప్రజలు మరియు విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే లక్ష్యంగా సాగిన ఈ వన మహోత్సవం గ్రామంలో తీవ్ర ప్రశంసలు అందుకుంది.




## షెడ్యూల్ తెగల ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టిన కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 25**

భద్రాది కొత్తగూడెం :జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో షెడ్యూల్ తెగలకు సంబంధించిన ఫిర్యాదులు, కేసులపై సమగ్ర విచారణ చేపట్టారు. కమిషన్‌కు అందిన వివిధ ఫిర్యాదులపై సంబంధిత అధికారులు, ఫిర్యాదుదారుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 40 కేసులను విచారణకు స్వీకరించి, ఆయా కేసులకు సంబంధించిన రికార్డులు, నివేదికలను పరిశీలించారు. కేసుల వారీగా సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న కమిషన్ సభ్యుడు, ఫిర్యాదుల పరిష్కారానికి ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. షెడ్యూల్ తెగలకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. విచారణ సందర్భంగా అధికారులు ఆయా కేసులకు సంబంధించిన రికార్డులు, నివేదికలను కమిషన్ సభ్యుడికి సమర్పించి వివరాలను వెల్లడించారు. గిరిజనుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఫిర్యాదుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విచారణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఖానాపురం కాంగ్రెస్ పార్టీ ఎస్.సి. సెల్ మండల కమిటీ నియామకం

**నర్సంపేట రూరల్, ఖానాపురం,ఆగస్టు 25, ప్రజా తీర్పు ప్రతినిధి:**

ఖానాపురం నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డిఆదేశానుసారం ఈరోజు ఖానాపురం మండల ఎస్.సి. సెల్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ఖానాపూర్ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు ఖానాపురం సొసైటీ చైర్మన్ వల్లెపు శ్రీనివాస్ పాల్గొనడం జరిగింది మండల అధ్యక్షుడిగా బత్తిని సునీల్ (బుధరావుపేట), ఉపాధ్యక్షులుగా మచ్చ వెంకన్న (మంగళవారిపేట), కందిక రాంబాబు (పెద్దమ్మగడ్డ), బేతమల్ల నర్సయ్య (అశోక్ నగర్), ప్రధాన కార్యదర్శులుగా సోగాల నవీన్ (రంగాపురం), జాడి వెంకటేష్ (అశోక్ నగర్), ప్రచార కార్యదర్శులుగా అలువాల కిరణ్ (ధర్మరావుపేట), మేడపల్లి రవికుమార్ (కొత్తూర్), మర్రి డావిడ్ (ఖానాపురం),కోశాధికారిగా కందిక యాకయ్య (రంగాపురం), కార్యదర్శులుగా ఏదెల్లి రమేష్ (బుధరావుపేట), అందె లక్ష్మణ్ (మంగళవారిపేట), మర్రి ప్రభాకర్ (ఖానాపురం), అరకాల నర్సింహ స్వామి (ధర్మరావుపేట) నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మర్రి రాజాలు, ఎర్ర స్వామిదాస్, కందిక యాకయ్య, బొక్క బాబు, సపట్ల రేవంత్, కొత్తూరు కృష్ణమూర్తి, కొయ్యల అనిల్, అనపర్తి సాయిలు, చిన్నయ్యపల్లి రాజకుమార్, అలువాల మదన్, జిల్లా కమిటీ కార్యదర్శిగా గారే రవికుమార్ జిల్లా కమిటీ సభ్యులుగా అలువాల అనిల్, చేడిపాక రామస్వామి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బత్తిని సునీల్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలవేరు శ్రీనివాస్ ఖానాపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాఖమూరి హరిబాబు ఖానాపురం సొసైటీ చైర్మన్ వల్లెపు శ్రీనివాస్ బుధరావుపేట సర్పంచ్ పెసరు రాణి గోవర్ధన్ రెడ్డి కి గ్రామ పార్టీ అధ్యక్షులు లింగిడి వెంకటేశ్వర్ల మరియు ఈ కమిటీకి సహకరించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## నర్సంపేటలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**నర్సంపేట టౌన్ ఆగస్టు 25 ప్రజా తీర్పు ప్రతినిధి**



నర్సంపేట.తొలి బహుజన యోధుడు, గోల్కొండ కోటపై జెండా ఎగర వేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలను నర్సంపేట పట్టణం లోని పాపన్న గౌడ్ విగ్రహం వద్ద వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహం కమిటీ అధ్యక్షులు సోల్తి సారయ్య గౌడ్ తో పాటు కమిటీ సభ్యులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సారయ్య గౌడ్ మాట్లాడుతూ 15వేల మంది బహుజన సైన్యంతో నాటి పాలకులపై ఎదురొడ్డి గోల్కొండ ఖిలాను ఏలిన ఘనత సర్దార్ సర్వాయి పాపన్నకే దక్కిందని పేర్కొన్నారు.విగ్రహం కమిటీ ప్రధాన కార్యదర్శి, గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయస్ఫూర్తితో గౌడుల అభివృద్ధికి కృషి చేస్తా మని తెలిపారు. గౌడ సామాజిక వర్గం ఆర్థిక స్వావలంబన,సామా జిక అభ్యున్నతి, సముచిత రాజకీయ ప్రాధాన్యం కోసం ఐక్యంగా కృషి చేస్తామని పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో విగ్రహం కమిటీ కోశాధికారి ఊడ్గుల శ్రీనివాస్ గౌడ్, మాచర్లఐలుమల్లు గౌడ్, నర్సంపేట పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు,కమిటీ సభ్యులు కోల వెంకటేశ్వర్లు గౌడ్, కొయ్యేడి కొమురయ్య గౌడ్, గిరాగాని చంద్రమౌళి గౌడ్, మద్దెల శ్రీనివాస్ గౌడ్, నాతి సదానందం గౌడ్, గిరాగాని కిరణ్ గౌడ్, మొలగాని సురేష్ గౌడ్, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, మద్దెల రవి గౌడ్, నాగేలి ప్రమోద్ గౌడ్, వేముల కృష్ణ గౌడ్, చుక్క కనుకయ్య గౌడ్, తాళ్లపెల్లి చంద్రమౌళి గౌడ్, గండు స్వామి గౌడ్, మోకు దెబ్బ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ కందుల శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గొపగాని వెంకటేశ్వర్లు గౌడ్, జిల్లా ప్రధాన కార్య దర్శి మాచర్ల దేవేందర్ గౌడ్, దుద్దే కుమారస్వామి గౌడ్, పోశాల సతీష్ గౌడ్, మచ్చిక రాజు గౌడ్, సోల్తి సాంబయ్య గౌడ్, సోల్తి సునీల్ గౌడ్, సొల్తి మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కటారి ఉత్తమ్ కుమార్ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యారి సంఘం నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది

**నర్సంపేట టౌన్ ఆగస్టు 25 ప్రజా తీర్పు ప్రతినిధి**

ఈ కార్యక్రమంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్ వేముల సాంబయ్య గౌడ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సభ్యులు దండెం రతన్ కుమార్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల సారంగం గౌడ్,29 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ బిట్స్ కాలేజ్ విద్యార్థి సంఘం అధ్యక్షులు జస్వంత్, గణేష్, బిట్టు వర్మ, శివ, శేషగిరి,పట్టణ కాంగ్రెస్ కమిటీ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డివిజన్ అధ్యక్షులు దొమ్మటి కుమార్ స్వామి గౌడ్, కొయ్యడి కిరణ్ కుమార్ ,ఓరుగంటి కుమారస్వామి, మైనార్టీ నాయకులు ఎండి అఖిల్ భాష,29వ డివిజన్ నాయకులు వేముల బిక్షపతి, గండు విజయ్ కుమార్, ఎండి మహబూబ్ బాషా,మరియు విద్యార్థి సంఘాల నాయకులు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## చీరకట్టులో కళ్ళు చెదరగొడుతున్న లెనిన్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే



# నేత్రదాన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 25**




నేత్రాలను దానం చేసే వారిని ప్రోత్సయించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ నందు 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల అవగాహన మరియు ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్రదానం ఒక మహత్తరమైన సామాజిక సేవ అని, ఒక వ్యక్తి మరణానంతరం దానం చేసే నేత్రాలు ఇద్దరు అంధులకు వెలుగును ప్రసాదించే అవకాశం ఉందని తెలిపారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పుట్టిన శిశువు నుండి అన్నీ వయస్సుల వారికి నేత్ర రుగ్మతలను గుర్తించి, తగిన చికిత్స అందించి వారికి మంచి చూపుతో ఆరోగ్య కరమైన జీవితం అందించాలని, ప్రజలు నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించుకొని, తమ కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. స్కూల్స్ , కాలేజీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించాలని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ల నిర్వహణ కొరకు 90 రోజులలో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తేవాలని, మెడికల్ కళాశాలలో లైబ్రరీ నిర్వహణకు సంబంధించి 30 లక్షల లోగడ విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యం కలిగిన మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భముగా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యక్రమాలను సమర్ధవంతముగా అమలు పరుచుటకు రూ .50,000 మంజూరు చేశారు. "మీ కళ్లను మరణానంతరం మట్టిలో కలపకుండా, మరొకరి జీవితంలో వెలుగుగా మార్చండి -- నేత్రదానం చేయండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు మరియు ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించనున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా,, పెండెం వెంకట రమణ తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల నుండి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని "నేత్రదానం చేయండి -- మరొకరికి చూపును ప్రసాదించండి" అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా,, శ్రవణ్ కుమార్, కంటి వైదులు డా,, యస్ రమేశ్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. వెంకట రమణ, ప్రోగ్రాం అధికారి డా,, జి చంద్రశేఖర్, డా,, నాజియా తబస్సుం, డా,, శ్రీశైలం, డా,, వాసవి, వైద్య , ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020